ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శుక్రవారం 22 ఆగస్టు 2025


గుమ్మసముద్రం చెరువు కింది భాగంలో కాలువ భద్రతకు వేసిన ఇసుకబస్తాలు

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

- మండపాల వద్ద అన్ని నిబంధనలు పాటించాలి
- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగ సందర్భంగా జిల్లాలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహించే వారు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో అనుమతులు తప్పనిసరిగా పొందాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినాయక ఉత్సవాల, మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్ విధానంలో అనుమతులు పొందాలన్నారు. గణేశ్ ఉత్సవ వెబ్‌సైట్ ద్వారా తప్పనిసరిగా దరఖాస్తు చేసుకుని అనుమతులు పొందాలన్నారు. అనంతరం పోలీసు అధికారి ఆ మండపం ప్రాంతాన్ని పరిశీలించి క్యూఆర్ కోడ్‌తో కూడిన ఎన్‌వోసీ జారీ చేస్తారని ఎస్పీ తెలిపారు. పెద్ద పెద్ద సౌండ్లతో లౌడ్ స్పీకర్లు పెట్టకూడదని (డీజే సౌండ్), భద్రత కోసం రాత్రి సమయాల్లో మండపాల వద్ద ఉత్సవ కమిటీ వారు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిమజ్జనం రోజు ఊరేగింపునకు పోలీసు వారు అనుమతించిన సమయం, కేటాయించిన ప్రదేశం, ఊరేగింపునకు కేటాయించిన మార్గం లాంటి నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినా, జరిగే అవకాశం ఉన్నా ముందుగానే సంబంధిత పోలీసు అధికారులకు గానీ 112 నెంబర్‌కు తెలియపర్చాలన్నారు. పండుగను శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించాలని, నిమజ్జనం రోజు తగిన బందోబస్తు సిబ్బందితో ఏర్పాటు చేసుకోవాలని, జిల్లా పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు.

యూరియా సరఫరాలో జాగ్రత్తలు వహించాలి

- జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ


యూరియా నిల్వలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ


నందలూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : యూరియా సరఫరాలో జాగ్రత్తలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి జి.శివనారాయణ మండల వ్యవసాయాధికారులకు సూచించారు. గురువారం నందలూరు మండలంలో ఆయన ఆకస్మికంగా పర్యటించి రైతుసేవా కేంద్రంలోని యూరియా నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియాను పంటలకు మాత్రమే వాడాలని రైతులకు తెలియజేశారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లను అడిగి పురోగతి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల అమలులో కొంచెం వేగం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మల్లికార్జున, వ్యవసాయశాఖ సిబ్బంది భరత్‌కుమార్, శిల్ప, విజయ తదితరులు పాల్గొన్నారు.

హంద్రీ-నీవా

కాలువ భద్రమేనా...!


పరగోడు వద్ద ప్రవహిస్తున్న నీటికి ఆనుకుని వేస్తున్న కాంక్రీట్

- పూర్తి కాని సిమెంట్ లైనింగ్ పనులు
- పెండింగ్‌లో ఉండగానే నీటి తరలింపుతో సమస్యలు
- నీటి ప్రవాహంలోనే కాంక్రీట్ పనులు
- రాత్రింబవళ్లు హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ సిబ్బంది పర్యవేక్షణ


ఎక్స్‌కవేటర్ సాయంతో షీట్‌లు అమరుస్తున్న కార్మికులు

బి.కొత్తకోట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పడమటి ప్రాంత రైతులు ఎదురుచూసిన రోజు రానే వచ్చింది. హంద్రీ-నీవా కాలువ గుండా కృష్ణా జలాలు కుప్పం వైపునకు బిరాబిరా పరుగులు పెడుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో హంద్రీ-నీవా నీటిని పారించి తమ ఇష్టారాజ్యంగా ఎక్కడపడితే అక్కడ కాలువను తెగ్గొట్టి అస్మదీయులకు తరలించి, కుప్పంకు నీరిచ్చామంటూ ఒకరోజు షో చేయడం కాకుండా పకడ్బందీగా రూ.478 కోట్లతో కాలువ విస్తరణ, ఇరువైపులా సిమెంట్ లైనింగ్ పనులు చేపట్టి కుప్పం వరకు నీటిని తరలించి సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకెళుతోంది. ఇందులో భాగంగా నాలుగు రోజుల క్రితం సత్యసాయిజిల్లా కదిరి సమీపంలోని చెర్లోపల్లె వద్ద ఉన్న రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేశారు. గురువారం నాటికి కృష్ణాజలాలు మదనపల్లెకు చేరుకున్నాయి.

పూర్తి కాని సిమెంట్ లైనింగ్ పనులు

హంద్రీ-నీవా కాలువ పనులు మే నెల చివరికి పూర్తి కావాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ జూలై మాసాంతానికి కూడా పూర్తి కాలేదు. తీరా నీటిని విడుదల చేసే సమయానికి కూడా 68 శాతం లైనింగ్ పనులు మాత్రమే పూర్తయ్యాయి. కాలువ పొడవునా చెరువులకు నీటి మళ్లింపు కోసం ఓవర్ టేకింగ్ పాయింట్లతో పాటు, పలు ప్రాంతాల్లో లైనింగ్ పనులే జరగలేదు. అయినా ఒత్తిడి కారణంగా నీటిని మళ్లించారు. దీంతో లైనింగ్ పెండింగ్ ఉన్న చోట కాలువ భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఒకవైపు కాలువలో నీరు ప్రవహిస్తున్నా మరోవైపు పనులు చేస్తున్నారు.

రాత్రింబవళ్లు పర్యవేక్షణ

లైనింగ్ పనులు పూర్తి కాకుండానే కుప్పం వైపునకు నీటిని తరలించాల్సి రావడంతో హంద్రీ-నీవా అధికారులు రాత్రింబవళ్లు పర్యవేక్షిస్తున్నారు. వివిధ విభాగాలుగా పనులు దక్కించుకుని చేపట్టిన కంపెనీ ప్రతినిధులచే యుద్ధ ప్రాతిపదికన పనులు చేయించడంతో పాటు, కాలువ ఎక్కడా దెబ్బతినకుండా కాపు కాస్తున్నారు. అవసరమైన చోట ఎక్స్‌కవేటర్లతో మరమ్మతులు చేస్తూ, ఇసుకబస్తాలతో అడ్డుకట్ట వేస్తూ గస్తీ తిరుగుతున్నారు. అయినా పలుచోట్ల లీకేజీలు, ఓటీ పాయింట్ల వద్ద లైనింగ్ పనులు దెబ్బతినడం ఆందోళన కలిగిస్తోంది. తమ గ్రామాల శివార్లలో హంద్రీ-నీవా ప్రవాహం చూసి రైతులు ఒకవైపు ఆనందం వ్యక్తం చేస్తూనే మరోవైపు అసంతృప్తి కూడా చెందుతున్నారు.

ప్రాధాన్య క్రమంలో చెరువులను నింపుతాం

మొదట కుప్పంకు నీరు తరలించాక ప్రాధాన్య క్రమంలో చెరువులను కృష్ణా జలాలతో నింపుతాం. అవసరమైన చోట్ల అందుకే ఓటీ పాయింట్లు పెట్టాం. రైతులు, ప్రజల నుంచి అభ్యర్థనలు వచ్చిన చోట బ్రిడ్జిల నిర్మాణానికి ప్రతిపాదనలు పెట్టాము. మంజూరు కాగానే నిర్మిస్తాం. లైనింగ్ పనులు కూడా పూర్తి చేస్తాం.

-విఠల్‌ప్రసాద్, ఎస్‌ఈ, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్

బ్రిడ్జిలు కట్టకుండా గ్రామాలను వేరు చేస్తున్నారు.



హంద్రీ-నీవా కాలువ వెడల్పు చేసిన అధికారులు వాటిపై బ్రిడ్జిలు కట్టకుండా మాకు అన్యాయం చేస్తున్నారు. వ్యవసాయ పొలాలకు పోవడానికి, గుడి, బడులకు పోవడానికి కూడా ఇబ్బంది అయిపోతోంది. చానా దూరం తిరుక్కొని రావాల్సి వస్తోంది. ఏళ్ల తరబడి చెప్తున్నా కట్టలేదు. పైగా ఇప్పుడు కాలువ ఇంకా వెడల్పు చేసేశారు. ఏదైనా ప్రత్యామ్నాయం చేసుకోవడానికి కూడా లేకుండాపోయింది.

- సుబ్బయ్య రైతు, గుండ్లపల్లి

చెరువులను నింపాలి..



కాలువ ద్వారా వస్తున్న నీటితో స్థానికంగా ఉన్న చెరువులను నింపాలి. ప్రతిసారీ నీటిని తీసుకుపోతారు. ఇక్కడ చెరువులకు వదిలితే రైతులకు బాగుంటుంది. పైగా ఈసారి ఇరు పక్కలా, కింది భాగంలో కూడా సిమెంట్ వేయడంతో భూగర్భజలాలు కూడా వృద్ధి చెందవేమో అనిపిస్తోంది.

- శ్రీకంఠ, రైతు, గుండ్లపల్లె.

యూరియా.. లేదయా...! 6

- అమ్మలేమంటూ డీలర్ల ఆందోళన
- అవసరానికి మించి వాడుతున్న రైతులు



నెలన్నరగా 'బందీగా బుద్ధుడు' 6

- రేపు తిరుమావళవన్ రాక?



వేతనాలు పెంచండి

- ధర్నాలో అంగన్వాడీ వర్కర్లు



రాయచోటిలో ధర్నా చేస్తున్న అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు

రాయచోటి (నేతాజీ సర్కిల్), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఐసీడీఎస్ కార్యాలయం వద్ద గురువారం బ్లాక్‌డే సందర్భంగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లు, ఆయాలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని, గ్రాట్యుటీ జీవో సరిచేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర నాయకులతో చర్చలు జరిపి ఇప్పటికైనా ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం సీడీపీవోకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ అనుబంధం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాగ్యలక్ష్మి, ప్రాజెక్టు అధ్యక్షురాలు సిద్దమ్మ, విజయ, సుమలత, సురేఖ, పద్మజ, ఉమాదేవి, రెడ్డెమ్మ, షబానా, కళావతి, శంకరమ్మ, భూదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు తీసిన ఈత సరదా

- ముగ్గురు ఎంబీఏ విద్యార్థులు మృతి
- బాలరాజుపల్లె చెయ్యేరు వద్ద విషాదం
- ప్రాణాలతో బయటపడ్డ మరో ఐదుగురు విద్యార్థులు
- విద్యార్థుల కుటుంబీకుల్లో విషాదఛాయలు


మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు, సహచర విద్యార్థులు


కేశవ, చంద్రశేఖర్ రెడ్డి, దిలీప్ మణి కుమార్ (ఫైల్)

రాజంపేట/రాజంపేట టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : స్నేహితులంతా కలిసి సరదాగా ఈత కొట్టేందుకు బాలరాజుపల్లె వద్ద చెయ్యేరు నదికి వెళ్లారు. ఈ సరదా కాస్తా విషాదంగా మారింది. నదిలోని నీటి గుంతల్లో పడి ముగ్గురు విద్యార్థులు మృతి చెందారు. రాజంపేట అన్నమాచార్య యూనివర్సిటీలో చెందిన ద్వితీయ సంవత్సరం చదువుతున్న ముగ్గురు ఎంబీఏ విద్యార్థులు రాజంపేట మండలం గాలివారిపల్లె గ్రామానికి చెందిన సోంబత్తిన దిలీప్‌కుమార్, కడప జిల్లా ఒంటిమిట్ట మండలం కోనరాజుపల్లెకు చెందిన కొత్తూరు చంద్రశేఖర్‌రెడ్డి (22), కడప జిల్లా పోరుమామిళ్లకు గ్రామానికి చెందిన కేశవ అక్కడిక్కడే మృతి చెందగా మరో ఐదుగురు ప్రాణాలతో బయటపడ్డారు. రాజంపేట మండలం మన్నూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్‌రాజు, పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాజంపేట అన్నమాచార్య యూనివర్సిటీకి చెందిన ద్వితీయ సంవత్సరం ఎంబీఏ విద్యార్థులకు ఉదయం మాత్రమే క్లాసులు ఉంటాయి. గురువారం మధ్యాహ్నం 8 మంది కలిసి రాజంపేట-రాయచోటి ఘాట్ రోడ్డులోని బాలరాజుపల్లె వద్ద చెయ్యేరు నది వద్దకు ఈతకు వెళ్లారు. ఎగువ ప్రాంతాల్లో వారం రోజులుగా వర్షాలు కురవడం, పింఛా ప్రాజెక్టు గేట్లు ఎత్తడం వల్ల నాలుగు రోజుల కిందట వరద నీరు చెయ్యేరుకు చేరింది. అందరూ భోజనాలు చేసి సరదాగా నదిలోకి దిగారు. బాలరాజుపల్లె వద్ద ప్రభుత్వం ఇసుక రీచ్‌ను మంజూరు చేసింది. ఆ ఇసుక రీచ్ కోసం వాహనాలు వెళ్లేందుకు మట్టిరోడ్డును వేశారు. దీనివల్ల అక్కడ పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. అందులోను వరదనీరంతా ఇసుక గోతులు ఉన్న వైపే అధిక స్పీడుతో నీరు పోతోంది. ఈ విషయాన్ని గమనించక విద్యార్థులు నదిలోకి దిగారు. వీరిలో సోంబత్తిని దిలీప్‌కుమార్, కొత్తూరు చంద్రశేఖర్‌రెడ్డి, పీనరోతు కేశవ ఇసుక గుంతల్లో చిక్కుకుని అక్కడిక్కడే మృతి చెందారు. వారితో పాటు వెళ్లిన మరో ఐదుగురు విద్యార్థులు వెంటనే విషయాన్ని గమనించి బయటకు వచ్చేశారు. ఈ సమయంలో మహేంద్ర అనే విద్యార్థి కొట్టుకుపోతుండగా సహచర అనిల్ అనే విద్యార్థి అతడిని రక్షించాడు. ప్రాణాపాయం నుంచి బయటపడ్డ వారిలో నంద్యాలకు చెందిన లోకేశ్వర్‌రెడ్డి, రాజంపేటకు మండలం ములక్కాయలపల్లెకు చెందిన బాలదిలీప్, బి.కోడూరుకు చెందిన బుగ్గినేని మహేంద్ర, రాజంపేట మండలం బ్రాహ్మణపల్లెకు చెందిన సూరేపల్లె ఆనంద్‌లు ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే మిగిలిన విద్యార్థులు 100కు ఫోన్ చేయగా మన్నూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను ఓ ఈతగాడి సహాయంతో బయటకు తీశారు. మృతదేహాలను రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని గురువారం సాయంత్రం మృతుల తల్లిదండ్రులకు పోలీసులు సమాచారం అందించడంతో వారు కన్నీరు మున్నీరయ్యారు. తమ పిల్లలు ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు పొంది స్థిరపడతారని తమ ఆశలు నెరవేరతాయానుకున్న తల్లిదండ్రులకు వారి ఈత సరదా వారి ఆశయలను అడియాశలు చేసింది. దీంతో సహచర విద్యార్థుల్లో తీవ్ర దుఃఖాన్ని మిగిల్చింది.

రెవెన్యూ అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



రెవెన్యూ అధికారుల శిక్షణలో సూచనలు ఇస్తున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి

మదనపల్లె టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలను కాపాడటంలో రెవెన్యూ అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. గురువారం స్థానిక ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో మదనపల్లె డివిజన్‌లోని 11 మండలాల రెవెన్యూ అధికారులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చే అర్జీల పరిష్కారంలో, భూవివాదాలను, భూ రీసర్వే పనులను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఇటీవల వీఆర్‌వోలను డిప్యుటేషన్‌పై బదిలీ చేశామని, కొందరు ఇంకా రిలీవ్ కాకుండా, బదిలీ అయిన చోటికి వెళ్లకుండా ఉన్నారని, వారందరూ వెంటనే డిప్యుటేషన్ చేసిన ప్రాంతాల్లో జాయిన్ కావాలన్నారు. ఉత్తర్వులను పెడచెవిన పెడితే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రీసర్వేలో జాయింట్ ఎల్‌పీఎంలు పెడితే రైతులు ఇబ్బంది పడాల్సి వస్తుందని, ఆ సమస్య రాకుండా చూడాలన్నారు. కొంత మంది అధికారులు నిర్లక్ష్యం, అవినీతి కారణంగా ప్రతికూలతలు వస్తున్నాయని, అలా కాకుండా నిజాయతీగా పనిచేయాలని సూచించారు. అలాంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పలు అంశాలపై అధికారులకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి, సర్వే ఏడీ భరత్‌కుమార్, తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఏడాదిలో రెండు పంటల సాగే సీఎం లక్ష్యం

- హంద్రీ-నీవా జలాలకు హారతిఇచ్చిన ఎమ్మెల్యే


చిప్పిలి వద్ద హంద్రీ-నీవా జలాలకు హారతి ఇస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాష

మదనపల్లె టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏడాదికి రెండు వరి పంటల సాగుకు నీరందించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే షాజహాన్‌బాష అన్నారు. గురువారం చిప్పిలి వద్దకు హంద్రీ-నీవా జలాలు చేరుకోవడంతో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి జలహారతి ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ హంద్రీ-నీవా కాలువలో రికార్డు స్థాయిలో సిమెంట్ లైనింగ్ పనులు పూర్తి చేయిస్తూ, శ్రీశైలం నుంచి కృష్ణా నది బ్యాక్ వాటర్‌ను ఎత్తిపోతల పథకం ద్వారా కర్నూల్, అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని ప్రజలకు సాగు, తాగునీరు అందిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా హంద్రీనీవా జలాలను మరో ఆరు రోజుల్లో కుప్పం చేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మదనపల్లె పట్టణ ప్రజలకు తాగునీరు అందించే రెండు సమ్మర్ స్టోరేజి ట్యాంకుల మొరవల నిర్మాణానికి రూ.14 కోట్లతో ప్రతిపాదనలు పంపారని, నిధులు మంజూరు కాగానే పట్టణ ప్రజల దాహార్తి తీరుస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఎస్‌ఈ విఠల్ ప్రసాద్, ఈఈ రాజగోపాల్, డీఈ వెంకటప్రతాప్, ఎంపీడీవో మస్తాన్‌వలి, టీడీపీ నేతలు బంగారు రామకృష్ణాచారి, జంగాల రమణ, బాబా ఫక్రుద్దీన్, చిన్నమహేష్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ వంద శాతం జరగాలి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రవి

రాయచోటి(నేతాజీ సర్కిల్), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ వందశాతం అమలు చేయడానికి రోడ్ మ్యాప్ రూపొందించాలని మున్సిపల్ కమిషనర్ రవి తెలిపారు. గురువారం రాయచోటిలో జరిగిన మున్సిపల్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో ప్రతి 15 రోజులకు ఒకసారి మురుగు కాలువలను శుభ్రపరిచే కార్యక్రమాన్ని చేపట్టాలని శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీలకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి నెలా మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మురుగునీరు నిలిచే ప్రదేశాలను శుభ్రం చేయాలని తెలిపారు. దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచిస్తూ విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని హెచ్చరించారు. పరిశుభ్రమైన ఆరోగ్యకరమైన పట్టణ నిర్మాణంలో అధికారులు, సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

విద్యార్థులతో భోజనం వడ్డింపు



ఎస్పీవీడీ సభా హైస్కూల్లో భోజనం వడ్డిస్తున్న విద్యార్థులు

సిద్దవటం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతి ప్రభుత్వ పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం అమలుకు వంట ఏజెన్సీలను నియమించింది. సమకూర్చారు. మండలంలోని ఉప్పరపల్లె ప్రభుత్వ, ఎయిడెడ్, ఎస్పీవీడీ హైస్కూల్లో గురువారం మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులే తోటి విద్యార్థులకు వంట మనుషులుగా భోజనం వడ్డించారు. నలుగురు విద్యార్థులు తోటి విద్యార్థులకు భోజనం వడ్డిస్తుండడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. హైస్కూల్లో 172 మంది విద్యార్థులు ఉండగా 150 మంది హాజరయ్యారు. ప్రతిరోజూ ఇదేవిధంగా విద్యార్థులు భోజనం వడ్డిస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై కడప జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్‌ను వివరణ కోరగా విద్యార్థుల చేత భోజనం వడ్డించకూడదని, వంట ఏజెన్సీ యాజమాన్యంకు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు.

రెండు పాడి ఆవులు మృతి

కలుషిత ఆహారమే కారణమన్న పశు వైద్యాధికారి



మృతి చెందిన రెండు పాడి ఆవులు

తంబళ్లపల్లె, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రెండు పాడి ఆవులు అకస్మాత్తుగా మృతి చెందాయి. బాధిత రైతు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక వెంకటేశ్వరవీధికి చెందిన రైతు సుధాకర్ తన మూడు ఆవులను రోజు లాగానే బుధవారం ఇంటి పక్కనే ఉన్న చేన్లో మేతకు తోలుకెళ్లి సాయంత్రం ఆవులను తిరిగి షెడ్డులో తోలి పాలు పితికి మేత వేసి వెళ్లాడు. రాత్రి 9 గంటలకు మేత వేయడానికి వెళ్లగా ఒక ఆవు గిలగిలా కొట్టుకుంటూ కింద పడిపోయింది. ఈ విషయాన్ని స్థానిక పశు వైద్య సిబ్బందికి సమాచారం అందించగా వెంటనే వచ్చి ఆవును పరీక్షించి అప్పటికే చనిపోయినట్లు తెలిపారన్నారు. గురువారం ఉదయం 9 గంటలకు మరో ఆవు కూడా అదే విధంగా చనిపోయిందని రైతు కన్నీటి పర్యంతమయ్యాడు. మరో ఆవు కూడా నీరసంగా ఉండడంతో వెంటనే పశు వైద్యశాలకు తీసుకువెళ్లి చికిత్స అందించడంతో కోలుకుంటున్నట్లు తెలిపాడు. చనిపోయిన రెండు ఆవుల విలువ సుమారు రూ1.50 లక్షల వరకు ఉంటుందన్నాడు. కలుషిత ఆహారం తినడంతోనే ఆవులు మృతి చెందాయని మండల పశు వైద్యాధికారి విక్రమ్‌రెడ్డి ధ్రువీకరించారు. పశువులకు వేసిన దాణా నమూనాను సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు పశువైద్యాధికారి తెలిపారు. ప్రభుత్వం స్పందించి రైతును ఆదుకోవాలని స్థానికులు, రైతులు కోరుతున్నారు.

ఆర్టీసీ ఆధ్వర్యంలో ఉచిత డ్రైవింగ్ శిక్షణ

రాయచోటి (కలెక్టరేట్), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులాల సేవా సహకార సంఘం సౌజన్యంతో ఏపీఎస్ఆర్టీసీ ద్వారా భారీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల సేవా సహకార సంఘం అన్నమయ్య జిల్లా కార్యనిర్వహణాధికారి బి.రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని వారు తెలిపారు. దీనికి అర్హత కలిగిన వారు షెడ్యూల్ కులాలకు సంబంధించిన వారై ఉండాలి. వారికి 21 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలి. మెడికల్ సర్టిఫికెట్‌తో పాటు లైసెన్స్ సర్టిఫికెట్, హెవీ మోటార్ లైసెన్స్ కొరకు 210 రూపాయలు ఎల్ఎల్ఆర్ కొరకు 1060 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని వారు తెలిపారు. ఇందులో మొత్తం 10 మందిని ఎంపిక చేస్తారని అందులో 5 మంది మహిళలు, మిగిలిన 5 మందిని పురుషులను తీసుకుంటారని వారు తెలిపారు. మరిన్ని వివరాల కొరకు 9059100840 నెంబరు సంప్రదించాలన్నారు.

నీతి అయోగ్‌లో కురబలకోటకు బంగారు పతకం



జేసీ నుంచి ప్రశంసాపత్రం అందుకున్న ఎంపీడీవో, సిబ్బంది

కురబలకోట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కురబలకోట మండలానికి నీతి అయోగ్‌లో బంగారు పతకం దక్కినట్లు ఎంపీడీవో గంగయ్య తెలిపారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో రాష్ట్ర స్థాయిలో ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాంలో భాగంగా నీతి అయోగ్ ద్వారా సంపూర్ణ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ప్రభుత్వం నిర్దేశించిన 6 డెవలప్‌మెంట్ ఇండికేటర్స్‌లో 6 మార్కులకు గాను 6 మార్కులు సాధించి కురబలకోట ప్రథమస్థానంలో నిలిచింది. దీంతో ఎంపీడీవో గంగయ్యకు జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ బంగారు పతకంతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

యూరియా.. లేదయా...!



- యూరియా అమ్మలేమంటూ డీలర్ల ఆందోళన
- అవసరానికి మించి వాడుతున్న రైతులు
- డీబీటీ నివేదికల్లో తప్పుల కుప్పలు

ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు కురవక అల్లాడిన రైతులు, ప్రస్తుతం విస్తారంగా వర్షాలు పడటంతో వరి సాగుకు సన్నద్ధమవుతున్నారు. యూరియా కొరత వుందని తెలుసుకుని ఇంట్లో వున్న సభ్యులందరి ఆధార్‌కార్డులు పట్టుకుని ఎరువుల దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. కొంతమంది ముందస్తుగానే యూరియా అధికంగా కొనుగోలు చేసి నిల్వలు ఉంచుకుంటున్నారు. ఎరువుల డీలర్లు యూరియా విక్రయాలంటేనే హడలెత్తుతున్నారు. యూరియా తమ వద్ద లేదంటూ దుకాణాల ఎదుట నోటీసు బోర్డులు పెడుతున్నారు.

మదనపల్లె టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో జిల్లా వ్యాప్తంగా రైతులు వరి సాగుపై దృష్టి పెట్టారు. దీనికి అనుగుణంగా ముందస్తుగా ఎరువులు (యూరియా) సేకరించి నిల్వ చేసుకుంటున్నారు. వచ్చే రబీ సీజన్‌లో 25 వేల హెక్టార్లలో వరి, జొన్నకర్రలు (ఆవులకు మేత)తో పాటు వివిధ రకాల పంటలు సాగు కానున్నాయి. పైరు ఏపుగా పెరిగేందుకు రైతులు యూరియాపైనే ఆధారపడుతున్నారు. జిల్లాలో జూన్, జూలై, ఆగస్టు నెలలకు ప్రభుత్వం కేటాయించిన యూరియా చూసుకుంటే జూన్‌లో ప్రైవేటు దుకాణాలకు 197.2 మెట్రిక్ టన్నులు, రైతు సేవా కేంద్రాలు (ఆర్ఎస్‌కే)లకు 665.04 మెట్రిక్ టన్నులు, జూలై నెలలో ప్రైవేటు దుకాణాలకు 576, ఆర్ఎస్‌కేలకు 1114, ఆగస్టు నెలకు ప్రైవేటు దుకాణాలకు 435, ఆర్ఎస్‌కేలకు 850 మెట్రిక్ టన్నులు కలిపి మొత్తం ఇప్పటి వరకు 3,837 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశారు. ఈ యూరియా స్టాకు వచ్చిన రెండు రోజుల్లో పూర్తిగా అమ్మకాలు అయిపోతున్నాయి ఇది పోనూ ఆగస్టు నెల కోటా కింద 5064 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. రైతులు వారి భూముల వన్-బి, ఆధార్‌కార్డులు తీసుకొచ్చి ప్రైవేటు దుకాణాలు, ఆర్ఎస్‌కేల వద్ద పడిగాపులు కాచి మరీ యూరియా తీసుకెళ్లిపోతున్నారు. దీంతో జిల్లాలోని పలు ఎరువుల దుకాణల వద్ద యూరియా లేదంటూ బోర్డులు పెట్టేస్తున్నారు.



రామసముద్రంలో యూరియా కోసం దుకాణం ఎదుట బారులు తీరిన రైతులు (ఫైల్)

అవసరానికి మించి వాడుతున్న రైతులు

సాధారణంగా వరి సాగులో ఒకటిన్నర ఎకరా విస్తీర్ణానికి మూడు విడతలుగా కేవలం 80 కిలోల యూరియా మాత్రమే వినియోగించాల్సి ఉంది. కానీ వాస్తవంగా రైతులు చూస్తే ఒకటిన్నర ఎకరా వరి మడికి 245 కిలోల యూరియా వాడుతున్నారు. శాస్త్రీయంగా చూస్తే యూరియా వాడకం వలన పైరు ఏపుగా పెరగదని కేవలం సస్యరక్షణ కోసమే మాత్రమే యూరియా ఉపయోగపడుతుందని కేవీకే శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. కానీ రైతులు ఈ సూచనలు, సలహాలు పెడచెవిన పెడుతూ అవసరానికి మించి యూరియాను వాడుతున్నారు.

యూరియా అంటేనే డీలర్ల హడల్

యూరియానా మేమమ్మలేము స్వామి..అంటూ ఎరువుల డీలర్లు ముఖాలు చాటేస్తున్నారు. వాస్తవంగా యూరియా 45 కిలోల బస్తాను రూ.265కు విక్రయించాలి. యూరియా తయారు చేసే కంపెనీలు స్పిక్, జైకిసాన్, మంగళ, ఆర్‌సీఎఫ్, నాగార్జున కంపెనీల నుంచి రైలు మార్గంలో కడప, రేణిగుంట, చిత్తూరు స్టాక్ పాయింట్లకు యూరియా సరఫరా చేస్తాయి. అక్కడ నుంచి జిల్లా వ్యాప్తంగా యూరియా రవాణా చేయాలంటే బస్తాకు రూ.56 ఖర్చు వస్తోంది. అంతేకాకుండా గత ఏడాది యూరియా తయారు చేసే కంపెనీలు ఒక బస్తా యూరియాకు, మరో బస్తా వేప పిండి కొనుగోలు చేయాలని డీలర్లకు కండీషన్లు పెట్టాయి. దీంతో డీలర్లు ఈ కండీషన్‌ను అనుసరించి యూరియాతో పాటు వేప పిండి కూడా కొనుగోలు చేశారు. కానీ డీలర్ల నుంచి రైతులు కేవలం యూరియాను మాత్రమే కొనుగోలు చేశారు, వేప పిండి వద్దంటూ వెళ్లిపోయారు. దీంతో ఒక్కో డీలర్ వద్ద ఇప్పటికి వేపపిండి స్టాకు సేల్స్ లేక అలాగే నిలిచిపోయాయి. ఇకపోతే యూరియా బస్తా రూ.267 ఎమ్మార్పీకి విక్రయించాలి. కానీ ఖర్చులు అధికం కావడం రవాణా, కూలీలు కూడా గిట్టుబాటు కాకపోవడంతో రైతులు యూరియా విక్రయాలకు మొగ్గు చూపడం లేదు. కేవలం రైతు సేవా కేంద్రాలకు వచ్చిన యూరియాను వీఏఏలు విక్రయిస్తున్నారు. అది కూడా రైతులు ఆధార్ కార్డులు, వన్-బి జిరాక్స్‌లు చూపితేనే విక్రయిస్తున్నా..స్టాకు వచ్చిన రోజు సాయంత్రమే ఆర్ఎస్‌కేలు ఖాళీ అయిపోతున్నాయి.

స్టాకు విడుదల చేయని కంపెనీలు

జిల్లాలోని 500 రైతు సేవా కేంద్రాలకు వ్యవసాయ శాఖ యూరియాను మంజూరు చేసి వీఏఏల ద్వారా విక్రయిస్తోంది. ఇలా పంపిన స్టాకు విక్రయించిన వీఏఏలు డైరెక్ట్ బెనిఫిసరి ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) నివేదికలను పూర్తి చేసి జిల్లా ఉన్నతాధికారులకు పంపాలి. కానీ ఇటీవల జిల్లా వ్యాప్తంగా వీఏఏలు బదిలీలు కావడంతో, ఆర్ఎస్‌కేలకు బదిలీపై వచ్చిన వీఏఏలు డీబీటీ నివేదికలు పూర్తి చేయడంలో తప్పులు వచ్చినా, సరిదిద్దకుండా అలాగే ఉన్నతాధికారులకు పంపించేశారు. ఉదాహరణకు మదనపల్లె మండలంలో గత నెల 180 మెట్రిక్ టన్నుల యూరియా మంజూరు కాగా అన్ని ఆర్ఎస్‌కేలలో విక్రయించేశారు. కానీ డీబీటీ నివేదికల్లో కేవలం 20 టన్నులు మాత్రమే విక్రయించినట్లు నివేదికలు చూపిస్తున్నాయి.

అంటే ఇంకా మదనపల్లె మండలంలోని ఆర్ఎస్‌కేలల్లో 120 టన్నులు నిల్వ ఉన్నట్లు డీబీటీ నివేదికల్లో చూపిస్తుండటంతో రెండో దఫా యూరియా స్టాకు విడుదల కావడం లేదు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అంతేకాకుండా వన్-బిలు లేని రైతుల వేలిముద్రలు పడకపోవడంతో కూడా సమస్య వస్తోందని తెలుస్తోంది. ఈ సమస్యలన్నింటిపై గత సోమవారం విజయవాడ నుంచి డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ డిల్లీరావు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వ్యవసాయశాఖ అధికారులకు తగిన సూచనలిచ్చారు. ఎక్కడ కూడా యూరియా కొరత వుండకూడదని హెచ్చరించారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి 150 కుటుంబాలు చేరిక



మంత్రి మండిపల్లి సమక్షంలో టీడీపీలో చేరిన లక్కిరెడ్డిపల్లె వాసులు

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు, ఎంపీటీసీ సభ్యుడు పోల్‌రెడ్డి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో గురువారం 150 కుటుంబాలు విజయవాడలోని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నుంచి పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పోల్‌రెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ వైసీపీ మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి కుటుంబానికి ముఖ్య అనుచరుడిగా ఉంటూ వైసీపీలో చేరి ఎంతో సేవ చేశామని, వారి గెలుపునకు ఎంతగానో సహకరించామన్నారు. అయితే గడికోట కుటుంబాల నుంచి ఎలాంటి మేలు జరగలేదని దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు చూసి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సహకారంతో టీడీపీలో చేరామని ఆయన తెలిపారు. అలాగే పందిళ్లపల్లె మాజీ ఎంపీటీసీ రాజేంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ ఉమాపతిరెడ్డి, ముదిరాజ్ సంఘం బీసీ నాయకుడు ఎలంకూరి విజయభాస్కర్, బడుగు వాసుదేవుడు షైరాసాహెబ్, రవి, ఆచారి, చాగలగుట్టపల్లి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో వెంకట్రమణ, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

మదనపల్లె అర్బన్,ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్టు కదిరి రైల్వే జీఆర్పీ సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. గురువారం వెస్ట్ బెంగాల్‌కు చెందిన ఎస్‌కే షైమూల్ కుమారుడు షేక్ ఖాదిర్ (30) మదనపల్లె మండలం, సీటీఎం రైల్వేస్టేషన్ సమీప బ్రిడ్జి వద్ద హత్యకు గురైన విషయం తెలిసిందే. మృతుడు ఐదేళ్ల కిందట కురబలకోట మండలం అంగళ్లు గ్రామానికి వచ్చి అక్కడ ఇంటి నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ ఒరిస్సా నుంచి గంజాయి తెచ్చి మదనపల్లెలో అమ్ముతుండేవాడు. నెల క్రితం ఆసిఫ్ అనే వ్యక్తి తనకు 2 కేజీలు గంజాయి కావాలని ఖాదిర్‌కు రూ.50 వేలు ఇచ్చాడు. అతడికి గంజాయి ఇవ్వలేదు. డబ్బు కూడా తిరిగి ఇవ్వలేదు. దీంతో ఆసిఫ్ తన మిత్రులైన మౌలా, సుల్తాన్ చెప్పగా ముగ్గురూ కలిసి ఈనెల 15వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు అంగళ్లులో ఉన్న ఖదీర్ వద్దకు వెళ్లి అతడిని కారులో కిడ్నాప్ చేసి కర్ణాటక రాష్ట్రం రాయల్పాడు వద్ద నీలగిరి తోటలో ఖదీర్‌ను చెట్టుకు కట్టేసి కొట్టారు. అక్కడి నుంచి మదనపల్లెకు ఆసిఫ్ ఇంటికి తీసుకొచ్చి అక్కడ కూడా చిత్రహింసలు పెట్టారు. దీంతో దెబ్బలు తాళలేక అక్కడే చనిపోయాడు. దీంతో శవాన్ని సీటీఎం సమీపంలో రైల్వే బ్రిడ్జి వద్ద పడేసి వెళ్లారు. సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసులు నిందితులను గుర్తించారు. మదనపల్లె మండలం బసినికొండకు చెందిన జాకిర్‌ఖాన్ కుమారుడు ఆటోడ్రైవర్ పఠాన్ ఆసిఫ్‌ఖాన్ (40), మదనపల్లె పట్టణం, దేవళంవీధికి చెందిన షేక్ ఖాదర్‌వలి కుమారుడు షేక్‌మౌలా (33)ను కదిరి పోలీసుల నిందితులను గుర్తించారు. శవాన్ని పడేసేటప్పుడు ఎవరో చూశారని భయపడిన ఇద్దరు ఈనెల 20వ తేదీ కదిరి పోలీసుస్టేషన్‌లో లొంగిపోయారు. మరో నిందితుడు సుల్తాన్ పరారీలో ఉన్నాడు. ఇతడు 2016లో జరిగిన ఓ హత్య కేసులో నిందితుడు, ఇతనిపై రౌడీషీట్ కూడా ఉంది. కేసు దర్యాప్తులో ధర్మవరం ప్రభుత్వ రైల్వే సీఐ అశోక్‌కుమార్, కదిరి ప్రభుత్వ రైల్వే ఎస్ఐ బాలకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ మహబూబ్‌బాషా, ఉన్నారు.

నెలన్నరగా 'బందీగా బుద్ధుడు'

- రేపు తిరుమావళవన్ రాక?



బుద్ధుడి విగ్రహం చుట్టూ ఏర్పాటు చేసిన కంచె

మదనపల్లె, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మదనపల్లె బుద్ధునికొండలో బుద్ధుడి విగ్రహం తల నరికారని ఫిర్యాదు చేస్తే పోలీసులు, రెవెన్యూ అధికారులు కలిసి అక్కడున్న విగ్రహానికి ఇనుప కంచె వేసి బుద్ధుడిని బంధించారు. నెలన్నర రోజులు దాటుతున్నా ఇనుప కంచె నుంచి బుద్ధుడికి విముక్తి కల్పించలేదు. దీనిపై నిరసన తెలిపిన బౌద్ధులపై కేసులు పెట్టారు. దీంతో తీవ్ర ఒత్తిడికి లోనై బాస్ నేత పీటీఎం శివప్రసాద్ గుండెపోటుకు గురై స్టంట్ కూడా వేయించుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు, వీకేసీ పార్టీ అధినేత, పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ తిరుమావళవన్‌తో చర్చలు జరిపి ఇరువర్గాలు సమన్వయం పాటించి పరస్పర సహకారంతో బుద్ధుని కొండ వివాదాన్ని సున్నితంగా పరిష్కారం చేసుకునేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందులో భాగంగా ఈనెల 23వ తేదీ శనివారం ఎంపీ తిరుమావళవన్ బుద్ధుని కొండను సందర్శించేందుకు, అక్కడ బౌద్ధ సమ్మేళనం నిర్వహించుకునేందుకు అనుమతి ఇస్తామని పోలీసులు హామీ ఇచ్చారు. ఈ మేరకు బాస్ నాయకులు దరఖాస్తు చేసుకున్నారు. ఆ తరువాత పోలీస్ అధికారుల సూచనల మేరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు కూడా దరఖాస్తు చేసుకున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పోలీస్, రెవెన్యూ అధికారులు ఒకరిపై ఒకరు చెబుతూ నిర్వాహకులను తిప్పుకుంటున్నారు. సమావేశానికి ఒక్క రోజే వ్యవధి ఉండడంతో అనుమతి ఇస్తారో లేదో తెలియడం లేదు. ఇనుప కంచె నుంచి బుద్ధుడిని విడుదల చేస్తారో లేదో రేపటి వరకు వేచి చూడాల్సి ఉంది.

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి

ఒంటిమిట్ట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేద్దామని ఈగల్ అధికారులు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఉన్నత పాఠశాలలో ఈగల్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్ కట్టడి చేయడం కోసం ఈగల్ పేరుతో టాస్క్‌ఫోర్సును ఏర్పాటు చేశారన్నారు. డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతిఒక్కరు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. గంజాయి, డ్రగ్స్ సంబంధిత మాదక ద్రవ్యాల సమాచారాన్ని ఈగల్ టోల్‌ఫ్రీ నంబరుకు తెలపాలన్నారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులతో మాదకద్రవ్యాల నివారణలో భాగస్వామ్యం అవుతామని ప్రతిజ్ఞ చేయించారు.

కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం రమనిరంజనమ్మ, ఈగల్‌క్లబ్ సభ్యులు అయుబ్‌ఖాన్, నార్కోటిక్ అధికారులు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న దృశ్యం

రాయచోటి(నేతాజీ సర్కిల్), ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సంబేపల్లె ఆదర్శ పాఠశాలలో పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని అసిస్టెంట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ పీవీ నాగేంద్రకుమార్ అన్నారు. గురువారం ఆదర్శ పాఠశాల, కళాశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల నమోదు శాతం, రికార్డులను పరిశీలించారు. టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ పాఠశాలకు వచ్చే సమయం, బయటకు వెళ్లే సమయాన్ని పరిశీలించారు. తరగతి గదులు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి విద్యార్థులకు అర్థమయ్యేలా సరళరీతిలో బోధన అందించాలని తెలిపారు. విద్యాశక్తి క్లాసుల పనితీరు, ఎంసెట్, జేఈఈ, నీట్, ఎన్ఎస్‌యంఎస్ తరగతుల నిర్వహణ గురించి సమీక్షించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. పాఠశాల మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టిని తరలిస్తే క్రిమినల్ కేసులు



చెరువులోకి ట్రాక్టర్‌లు వెళ్లకుండా గాడి తీస్తున్న దృశ్యం

గాలివీడు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టిని తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ భాగ్యలత హెచ్చరించారు. గురువారం పెద్దచెరువులో మట్టి తరలిస్తున్న ప్రాంతాన్ని తహసీల్దార్ పరిశీలించారు. అనంతరం చెరువులోకి ట్రాక్టర్లు, జేసీబీ యంత్రాలు వెళ్లకుండా మార్గాలను మూసివేస్తూ ట్రెంచ్ (గొయ్యి) తీయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గుట్టలు, వాగులు, వంకలు, చెరువుల్లో అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలిస్తే క్రిమినల్ కేసులు పెట్టి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. అంతేగాక క్రిందిస్థాయి సిబ్బంది ప్రలోభాలకు పాల్పడి మట్టి వ్యాపారులకు సహకరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్వో, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.21.50 కోట్లతో అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న జడ్పీ సీఈవో

బి.కొత్తకోట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలో రూ.13.50 కోట్ల 15వ ఆర్థికసంఘం నిధులు, రూ.8 కోట్ల ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన నిధులతో మౌలిక వసతుల కల్పన, వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా సీఈవో రవికుమార్‌నాయుడు తెలిపారు. గురువారం ఆయన బి.కొత్తకోట మండలంలో పర్యటించారు. మరమ్మతు పనులు జరుగుతున్న జడ్పీ గెస్ట్‌హౌస్‌ను పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో, సిబ్బందితో ఆయన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. సీఈవో మాట్లాడుతూ మండలంలో చెత్త సంపద కేంద్రాలన్నీ వినియోగంలో ఉండేలా చూడాలన్నారు. రూ.18 లక్షలతో ఆరు గ్రామాలలో నిర్మించిన వాటర్‌ప్లాంట్ల స్థితిపై ఆరా తీశారు. తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, మౌలికవసతుల కల్పనలో పంచాయతీ కార్యదర్శులు అంకితభావంతో పనిచేసేలా చూడాలని ఆదేశించారు. కేంద్ర, కార్యక్రమంలో ఎంపీడీవో క్రిష్ణవేణి, ఏవో ఆనందకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అడల్ట్ కంటెంట్...



- ఇన్‌స్టాగ్రామ్‌లో అశ్లీల దృశ్యాలు
- ఆకర్షితులవుతున్న యువత
- బానిసలుగా మారుతున్న వీక్షకులు
- పోలీసులకు తలనొప్పిగా మారిన సమస్య

కడప క్రైం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత టెక్నాలజీ యుగంలో స్మార్ట్‌ఫోను ఉంటే ప్రపంచమే అరచేతుల్లో కనిపిస్తుంది. సెల్‌ఫోన్ వినియోగించని వారున్నారంటే ఆశ్చర్యమే. ఇక సెల్ చేతిలో ఉంటే ఫేస్‌బుక్, స్నాప్‌చాట్, ఇన్‌స్టాగ్రామ్‌ల వీక్షకుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతూనే ఉంది. ఈ నేపథ్యంలో కొంత మంది యువత, మధ్య వయస్కులు స్వయం తృప్తి కోసం ఆన్‌లైన్‌లో అడల్ట్ కంటెంట్ (అశ్లీల వీడియోలు) చూస్తుంటారు. ఈ మధ్యకాలంలో ఈ కంటెంట్ చూసే వీక్షకులు పెరిగిపోయారంటే అతిశయోక్తి కాదు. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ అడల్ట్ కంటెంట్ చూసేందుకు ఎగబడుతున్నారు. ఇక కొంత మంది యువత దీనికి అడక్ట్ అయిపోయారు. ఈ అశ్లీల వీడియోలు వారిపై ప్రతికూల ప్రభావాలు చూపుతన్నాయి. లైంగిక ఆలోచనలు, ప్రవర్తన, సంబంధాలపై ఈ ప్రభావం ఎక్కువగా కనబడుతోంది. వీరి వీక్‌నెసన్‌ను క్యాష్ చేసుకునేందుకు కొందరు సిగ్గు విడిచి బూత్ కంటెంట్, అశ్లీల దృశ్యాలు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేస్తున్నారు. యువకులను ఆకట్టుకునేలా రీల్స్ చేస్తున్నారు. టెంప్ట్ చేసే వీడియోలను ప్రైవేటులో ఉంచి మరింత కంటెంట్ కోసం సబ్‌స్క్రిప్షన్ అడుగుతున్నారు. ఇలాంటి వీడియోలను చూడాలంటే రూ.399 స్కానర్ ద్వారా వసూలు చేస్తున్నారు. ఓ మహిళ ఇన్‌స్టాగ్రామ్‌లో రూ.399 ఫీజు పెట్టగా.. ఆ ఫీజు చెల్లించి దాదాపు 8730 మంది సబ్ స్క్రయిబ్ చేసుకున్నారంటే ఆశ్చర్యానికి గురి చేస్తుంది.

● కడపకు చెందిన ఓ వివాహిత ఇన్‌స్టాగ్రామ్‌లో తన అశ్లీల దృశ్యాలను ప్రైవేటులో ఉంచింది. దాని కంటెంట్ కోసం సబ్‌స్క్రిప్షన్ అడగ్గా, ఎంతోమంది ఆ వీడియోల కోసం డబ్బులు చెల్లించి మరీ వీక్షించారు. గతంలో తన ప్రియుడుతో చేసిన వీడియో సైతం పోస్టు చేసినట్లు తెలుస్తుంది, చివరికి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆమెకు కౌన్సెలింగ్ చేసి పంపినట్లు సమాచారం.

● జిల్లాకు చెందిన మరో యువతి కూడా ఇలాగే వీడియో లను పోస్టులు చేసి యువత నుంచి డబ్బులు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు ఇదొ కొత్త వ్యాపారంగా మారుతోంది. ఇలాంటి వాటిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. పోలీసుల వద్దకు పోతే మన పరువు పోతుందన్న ఉద్దేశ్యంతో చాలా మంది వెనుకడుగు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో యువతను తల్లిదం డ్రులు సరైన దారిలో పెట్టలేక సతమతమవుతున్నారు. అడల్ట్ కంటెంట్‌తో వీడియోలు తీస్తూ సొమ్ము చేసుకుంటున్న వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

యువతపై ప్రభావం

అడల్ట్ కంటెంట్ యువతలో లైంగిక ఆలోచనలను రేకెత్తిస్తుం ది. ఇది వాస్తవికతకు దూరంగా ఉండే భావాలను కలిగి ఉండడానికి దారి తీస్తుంది. ఇలాంటి అశ్లీల వీడియోల వైపు యువత, పిల్లలతో పాటు పెద్దలు కూడా మొగ్గు చూపుతుంటారు. దీంతో వాస్తవికత జీవితం ఇలాగే ఉండాలనే భావనకు వస్తూ కొంతమంది దంపతులు విడిపోయే పరిస్థితులు తలెత్తుతు న్నాయి. మరికొందరు ఇతరులపై మోజు పెంచుకుని చేయి దాటి వెళుతున్నారు. ఇలాంటి వాటిపై ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో పోలీసులు చర్యలు తీసుకోలేని పరిస్థితి.

అప్రమత్తంగా ఉండాలి

13 నుంచి 20 సంవత్సరాల మధ్య యువతకు మంచి చెప్పినా బుర్రకు ఎక్కదు. ఇక మొబైల్ చేతిలో ఉంటే ఫేస్‌బుక్కు, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లో గడుపుతుంటారు. ఆ సమ యంలో పిల్లలు ఎలాంటి వీడియోలు చూస్తున్నారో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉంటూ గమనిస్తూ ఉండాలి. ఎక్కువగా యువత అశ్లీల దృశ్యాలకు ఆకర్షితులవుతున్నారు. దీంతో ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లోని అడల్ట్ కంటెంట్ వీడియోలకు ఎక్కువగా యువత బానిసగా మారుతోంది. ఈ నేపథ్యంలో పిల్లల పట్ల తల్లిదండ్రులు బాధ్యతగా ఉండాలంటూ పోలీసులు చెప్పుకొస్తున్నారు.

విషద్రావణం తాగి యువకుడు మృతి

దువ్వూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇడమడక గ్రామానికి చెందిన వినోద్‌కుమార్ (26) అనే యువకుడు విషద్రావణం తాగి మృతి చెందినట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. ప్రొద్దుటూరుకు చెందిన పవిత్ర అనే యువతిని వినోద్‌కుమార్ ప్రేమించాడు. వీరి పెళ్లికి పెద్దలు నిరాకరించారు. దీంతో ఆగస్టు 15న పవిత్ర ఉరి వేసుకుని మృతి చెందింది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన వినోద్‌కుమార్ బుధవారం రాత్రి విషద్రావణం తాగాడు. చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరుకు అటు నుంచి కర్నూలుకు తరలించగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుని తండ్రి గాబ్రియల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



శ్రీనివాసులు (ఫైల్)

దువ్వూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న భాకరాపురం గ్రామానికి చెందిన సి.శ్రీనివాసులు (54) అనే రైతు గురువారం విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. పొలం వద్ద మోటారు వదులుతుండగా షార్ట్‌సర్క్యూట్ కారణంగా షాక్‌కు గురై మృతి చెందాడన్నారు. మృతుని భార్య శివమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టంనిమిత్తం ప్రొద్దుటూరుకు తరలించినట్లు వివరించారు.

పొలం విషయమై దాడి

ముద్దనూరు ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి చిన్నదుద్యాల గ్రామంలో పొలం విషయమై గురువారం బోరెడ్డి శివనారాయణరెడ్డిపై అదే గ్రామానికి చెందిన భూమిరెడ్డి నాగిరెడ్డి మరి కొందరు దాడి చేసి గాయపరిచినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. సీఐ సమాచారం మేరకు వివరాలిలా.. బోరెడ్డి శివనారాయణరెడ్డి, భూమిరెడ్డి నాగిరెడ్డిల మధ్య పొలం విషయంలో తగాదా ఉంది. ఈ తరుణంలో శివనారాయణరెడ్డి పొలంలో పనిచేసుకుంటుండగా భూమిరెడ్డి నాగిరెడ్డి, లక్ష్మీప్రసాదరెడ్డి, బాలనాగిరెడ్డి, మరికొందరు పొలం వద్దకు ట్రాక్టర్లలో వచ్చి అతనిపై గొడ్డలితో దాడి చేశారు. దీంతో శివనారాయణరెడ్డికి రెండు చేతులకు రక్తగాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగితీగ చోరీ

సింహాద్రిపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బలపనూరు గ్రామం సాయిబాబా ఆలయం ప్రాంగణంలో గల సింగిల్ ఫేస్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ లోని రాగి తీగ బుధవారం రాత్రి చోరీకి గురైంది. గమనించిన ఆలయ నిర్వాహకులు గురువారం విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చారు. మండల విద్యుత్ అధికారి దినేష్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను కిందకు దించి అక్కడే పగులగొట్టి కాపర్ వైర్‌ను దుండగులు దోచుకెళ్లారు. ఈమేరకు సింహాద్రిపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఏఈ తెలిపారు.

పొలంలో విద్యుత్ వైర్లు...

మైదుకూరు రూరల్, ఆగస్ట 21 (ఆంధ్రజ్యోతి): పంట పొలాల్లోని బోర్ల వద్ద విద్యుత్ వైర్లు చోరీకి గురైనట్లు రైతులు మైదుకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ, వెంకటాపురం గ్రామాలలోని పొలాల వద్ద దొంగలు కరెంటు వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరు దొంగలించినట్లు తెలిపారు. ఆరుగాలం శ్రమించినా పంటల పండక అవస్థలు పడుతుంటే దొంగల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని బాధితులు పోలీస్‌స్టేషన్‌లో వాపోయారు.

రుణాలు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి

కడప ఎన్టీఆర్‌సర్కిల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాలతో పాటు రుణాలు పొందిన వారు సద్వినియో గం చేసుకోవడంతో పాటు సకాలంలో తిరిగి రుణాలు చెల్లించాలని డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి అన్నారు. డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో బ్యాంకర్లు, ఏపీయంలతో సంఘాల రుణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సంఘానికి ఆర్థిక, అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యతపై శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. జిల్లాలోని 26508 స్వయం సహాయక సంఘాలకు 10970 డిజిటల్ ఎంసీపీని ఆమోదించినట్లు తెలిపారు. మిగిలిన సంఘాలకు ఈనెలాఖరులోపు ఆమోదం వస్తుందన్నారు. రుణాలు మంజూరు చేసేందుకు బ్యాంకర్లు మరింతగా సహకరించాలని ఆమె కోరారు. రుణాల చెల్లింపులో రికవరీ మొత్తాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. అలాకాకుండా ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్య లు తీసుకుంటామని హెచ్చరించారు. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజరు కిశోర్ మాట్లాడుతూ కడప డివిజనులో ఎస్‌బీఐ బ్రాంచ్‌లు ఈనెల నాలుగో శనివారం కూడా పనిచేస్తాయని.. సైప్ సిబ్బంది బ్యాంకు అధికారులతో మాట్లాడి సంఘాలకు సంబంధించిన ఎంసీపీలు, సంఘాల రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎల్‌డీఎం జనార్ధన్, డీసీసీబ్యాంకు సీఐవో రాజామణి, వివిధ బ్యాంకుల ఆర్‌ఎంలు, డీఆర్‌డీఏ డీపీయంలు, జీవనోపాధుల డీపీయంలు, ఏపీఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.


ప్రపంచానికి తెలుగు జాతి కీర్తిని చాటిన నేత ఎన్టీఆర్



ఎన్టీఆర్ కాంస్య విగ్రహావిష్కరణలో ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

మైదుకూరు రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచానికి తెలుగుజాతి కీర్తిని చాటిన మహానుబావుడు ఎన్టీఆర్ అని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్ కొనియాడారు. మైదుకూరులోని కడప రోడ్డులో నూతనంగా మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని గురువారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌తో కలసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాయల్ కూడలి నుంచి ఏర్పాటు చేసిన ర్యాలీలో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ఫ్లడ్ లైట్లను ప్రారంభించి, ఎన్టీఆర్ విగ్రహ సమీపంలో మొక్కలను నాటారు. మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రవీంద్ర, టీడీపీ నాయకులు దాసరి బాబు, యాపరాల చిన్న, పాశం మారుతీ, మిల్లు శ్రీను, పుట్టా ప్రభాకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ సిబ్బంది నిరసన



కడప ఫారెస్టు డివిజను ఆఫీసు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అటవీశాఖ సిబ్బంది

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం వద్ద బుధవారం రాత్రి అక్కడ అటవీ సిబ్బందిపై స్థానిక ఎమ్మెల్యే, ఆయన అనుచరులు దౌర్జన్యం చేసి దుర్భాషలాడుతూ భౌతిక దాడులకు దిగిన సంఘటనపై వైఎస్ఆర్ కడప డివిజను అటవీశాఖ సిబ్బంది గురువారం ఫారెస్టు డివిజను ఆఫీసు వద్ద నిరసన వ్యక్తం చేశారు. నల్లబ్యాడ్జిలు ధరించి దాడులకు పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. అటవీ వనరులను కాపాడడానికి నిరంతరం కష్టపడుతున్న ఉద్యోగులపై ఇలాంటి దాడులు సరికాదన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సహచర ఉద్యోగులకు పూర్తి న్యాయం జరిగేంత వరకు నిరసన కార్యక్రమాలు సాగిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీలకు 10 మంది ఎంపిక

కడప స్పోర్ట్స్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): హర్యానాలోని కురుక్షేత్రంలో ఈనెల 25 నుంచి 27 వరకు జరుగనున్న జాతీయస్థాయి కరాటే పోటీలకు కడప జన్ షిటోర్ యు కరాటే విద్యార్థులు పది మంది ఎంపిక కావడం అభినందనీయం అని జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ పేర్కొన్నారు. ఆ మేరకు ఎంపికైన విద్యార్థులను గురువారం స్థానిక డీఈఓ కార్యాలయంలో ఆయన అభినందించి మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు ఆత్మస్థైర్యం పెంపొందించుకునేందుకు కరాటే క్రీడను ఎంచుకుని ప్రతిభ చాటడం ప్రశంసనీయమన్నారు. ఎంపికైన క్రీడాకారులు జాతీయ స్థాయిలో విజయం సాధించి జిల్లాకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కోచ్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ ఏజెన్సీపై కేసు నమోదు

కడప క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కడప నగరం సీపీబ్రౌన్ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన లిఫ్ట్ పని చేయకపోవడంతో డాక్టర్ రామచంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏజెన్సీలపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు సీపీ బ్రౌన్ లైబ్రరీలో 2018లో ఎస్‌పీసీ ఇన్‌ఫ్రా భారత్ ఎంటర్‌ప్రైజస్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో లిఫ్ట్ ఏర్పాటు చేశారు. అయితే అప్పటి నుంచి లిఫ్ట్ పనిచేయకపోవడంతో పలుమార్లు వారు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించలేదు. ఈ మేరకు సీపీబ్రౌన్ మెంబర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైతు ఆత్మహత్యపై విచారణ



ఇడమడక గ్రామంలో ప్రజలను విచారిస్తున్న ఆర్డీవో

దువ్వూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇడమడక గ్రామంలో రంగగాళ్ల బుజ్జి అనే రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై గురువారం జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ విచారణ చేశారు. ఏడీఏ క్రిష్ణమూర్తి, తహసీల్దారు సంజీవరెడ్డి, ఎస్ఐ వినోద్‌కుమార్‌తో కలిసి రైతు ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు. 2024 మే 6వ తేదీన అప్పుల బాధతో రైతు బుజ్జి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతనికి భార్య నరసమ్మ, నలుగురు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. అప్పట్లో ఏడు ఎకరాలు కౌలుకు తీసుకొని పంటలు సాగుచేసి తీవ్రంగా నష్టపోయి అప్పులపాలయ్యాడు. అప్పులు తీర్చే మార్గం లేక విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాలన్నింటిపై కుటుంబ సభ్యులు, అక్కడి ప్రజలతో అధికారులు ఆరా తీశారు. వీరు తెలిపిన విషయాలను విచారణ బృందం నమోదు చేసుకున్నారు.

చీపాడు పాఠశాలలో డీఈవో తనిఖీ



డీఈవోకు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

చాపాడు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చియ్యపాడు దళితవాడలోని ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్ గురువారం తనిఖీ చేశారు. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు పాఠశాలను ఆయన పరిశీ లించారు. ఇటీవల ఆ పాఠశాలలోని విద్యార్థులు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద తమ పాఠశాలను మోడల్ స్కూల్‌గా ఎంపిక చేయాలని ధర్నా నిర్వహించారు. ఇందుకు కలెక్టర్ స్పందించి ఆ పాఠశాల స్థితిగతులను తెలు సుకోవాలని ఆదేశించడంతో డీఈవో పాఠశాలను సందర్శిం చారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామచందర్‌రెడ్డి, ఏపీటీఎఫ్ మండలశాఖ అధ్యక్షుడు రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున డీఈవోకు వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు చెప్పవద్దని, ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మూల్యాంకన పుస్తకాన్ని, అనవసరమైన యాప్‌లను రద్దు చేయాలని వారు వినతి పత్రంలో కోరారు.

సివిల్, ఏపీఎస్పీ కానిస్టేబుళ్లు 23న హాజరు కావాలి

కడప క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సివిల్, ఏపీఎస్పీ కానిస్టేబుళ్లుగా ఎంపికైన వారు ఆగస్టు 23న తమ సర్టిఫికెట్లతో గుంటూరులో హాజరు కావాలని గుంటూ రు ఎస్పీ సతీష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని జిల్లాల నుంచి ఎస్‌సీటీ సివిల్, ఏపీఎస్పీ ఉద్యోగాలకు ఎంపికైన పురుష, స్త్రీ అభ్యర్థులు ఈనెల 23న గుంటూరు జిల్లా పోలీసు కార్యాలయం వద్ద ఉదయం 10గంటలకు హాజరు కావాలని తెలిపారు. అభ్యర్థులు ఎంపిక ప్రక్రియలో అప్లికేషన్‌తో జతపరిచిన అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, గెజిటెడ్ అధికారితో అటెస్టేషన్ చేయించిన మూడు సెట్ల జిరాక్స్ కాపీలు, నాలుగు పాస్‌పోర్టు సైజు కలర్ ఫొటోలను తీసుకురావాలని ఎస్పీ తెలిపారు.

పెన్నాకు కొనసాగుతున్న నీటి విడుదల

మైలవరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి నీటి విడుదల కొనసాగుతోందని జలాశయ అధికారులు సోమవారం తెలిపారు. పెన్నానదికి దాదాపు 10 వేల క్యూసెక్కుల నీరు, అలాగే ఉత్తర, దక్షిణ కాలువలకు 190 క్యూసెక్కుల మేర నీటిని వదులుతున్నామన్నారు. గండికోట జలాశయం నుంచి మైలవరం జలాశయానికి 10 వేల క్యూసెక్కుల మేర నీరు వచ్చి చేరుతోందన్నారు. మైలవరం జలాశయం పూర్తి నిలువ సామర్థ్యం 6.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 5.2 టీఎంసీల నీరు నిలువ ఉందన్నారు.

ఏఆర్ కానిస్టేబుల్ సస్పెన్షన్

కడప క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కడప ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న జి.శ్రీనివాసులను సస్పెండ్ చేస్తూ ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. కడపకు చెందిన ఓ నేత వద్ద ఆ కానిస్టేబుల్ గన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అయితే అతని వద్ద ఉన్న పిస్తోలు 9ఎంఎం పోగొట్టుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై విచారించిన ఎస్పీ అతనిపై సస్పెన్షన్ వేటు వేశారు.

డీసీఈబీ హాల్ నిర్మాణానికి సహకరించండి



సీఈఓకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్టీయూ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పదివేల మంది ఉపాధ్యాయులకు సంబంధించిన జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యాలయ నిర్మాణానికి సహకరించాలని కడప జిల్లా ఎస్టీయూ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇలియాస్ బాష, సంగమేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం జడ్పీ కార్యాలయంలో సీఈఓ ఓబులమ్మను కలిసి వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1997లో అప్పటి జిల్లా పరిషత్ చైర్మన్ తులసిరెడ్డి నిర్మింపజేసిన డీసీఈబీ హాల్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సంబంధించిన పరీక్షల నిర్వహణ, ప్రశ్నపత్రాల రూపకల్పన, ఉపాధ్యాయుల కౌన్సెలింగ్, విద్యారంగ సమస్యలపై సమావేశాల నిర్వహణకు ఉపయుక్తంగా ఉండేదన్నారు. దీన్ని కూల్చివేయడంతో ప్రస్తుతం డీసీఈబీ హాల్ లేక ఉపాధ్యాయులు, విద్యాశాఖ మండల, జిల్లా అధికారులకు చాలా ఇబ్బందికరంగా ఉందని తెలిపారు. కామన్ ఎగ్జామినేషన్ బోర్డు హాల్ నిర్మాణానికి సహకరించాలని ఎస్టీయూ ప్రతినిధులు కోరారు.

పెద్ద దర్గా అభివృద్ధికి సహకరించాలి



సీఎం చంద్రబాబుకు వివరిస్తున్న పీఠాధిపతి అరిఫుల్లాహుస్సేని

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో ప్రసిద్ధి చెందిన అమీన్‌పీర్ దర్గా అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలని పీఠాధిపతి హజ్రత్ కేఎస్ఎస్ అరీఫుల్లాహ్ హుస్సేని కోరారు. గురువారం సెక్రటేరియట్‌లో టీడీపీ కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డితో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు. పెద్దాదర్గా అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేయగా.. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తూ దర్గా అభివృద్ధికి అన్ని విధాలా సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్సీలకు భారీ మోటరు డ్రైవింగ్‌లో శిక్షణ

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని షెడ్యూలు కులాలకు చెందిన యువతకు భారీ మోటరు డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్సీ కార్పోరేషన్ ఈడి డాక్టర్ రాజ్యలక్ష్మి ప్రకటనలో తెలిపారు. 20 నుంచి 40సంవత్సరాల లోపు వారు మెడికల్ సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. లైట్ మోటరు వెహికల్ లైసెన్సు కలిగిన వారు ఈ శిక్షణకు అర్హులన్నారు. హెవీ మోటరు వెహికల్ ఎల్ఎల్ఆర్ కోసం రూ.211, లైసెన్సు కోసం రూ.1060 అభ్యర్థి చెల్లించాలని అన్నారు. జిల్లాలో మొత్తం 10మంది అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందని.. అందులో ఐదుగురు పురుషులు, ఐదు మంది మహిళలు ఉంటారన్నారు. దరఖాస్తులు పరిశీలించి అర్హులైన అభ్యర్థుల జాబితాను కలెక్టరు ఆమోదంతో ఎంపిక చేయనున్నట్లు వివరించారు. శిక్షణకు ఎంపికైన అభ్యర్థులకు ఏపీఎస్ ఆర్టీసీ డిపో మేనేజరు ఆధ్వర్యంలో భారీ మోటరు డ్రైవింగ్ శిక్షణ ఇచ్చి, శిక్షణ పూర్తయ్యాక అభ్యర్థులకు సర్టిఫికెట్ అందజేస్తారన్నారు. ఆసక్తిగల వారు తమ దరఖాస్తులను కలెక్టరు కార్యాలయంలోని ఎస్సీ కార్పోరేషన్ ఆఫీసులో ఈనెల 27లోపు సమర్పించాలని వివరించారు.

ఎంపీహెచ్‌డబ్ల్యు శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

కడప రిమ్స్ ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కడప రిమ్స్‌లో గల ప్రభుత్వ బహుళ ప్రయోజన ఆరోగ్య కార్యకర్తల మహిళా శిక్షణ పాఠశాలలో ఎంపీహెచ్‌డబ్ల్యు (ఫిమేల్) ట్రైనింగ్ కోర్సులో చేరేందుకు ఇంటర్‌మీడియట్ ఉత్తీర్ణులైన కడప, అన్నమయ్య, అనంతపురం జిల్లాల అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.లక్ష్మీ కోరారు. కోర్సు కాలవ్యవధి 2 సంవత్సరాలు ఉంటుందన్నారు. శిక్షణలో చేరు విద్యార్థినులకు ఉచిత విద్య, వసతి, వైద్యంతో పాటు రూ.2వేల నుంచి రూ.2500 వరకు స్టయిఫండ్ ఇస్తారన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులతో పాటు కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఏపీ పేరుతో తీసిన రూ.50 డీడీని జతచేయాలన్నారు. ఫీజు చెల్లింపునకు సెప్టెంబర్ 30 ఆఖరు తేదీ. ఎంపిక జాబితాను అక్టోబరు 15న ప్రకటిస్తారన్నారు. ఇతర వివరాలకు 944041165, 8790710182, 9491038846 అనే నెంబర్లను సంప్రదించాలన్నారు.

సీపీఐ మహాసభలను విజయవంతం చేయాలి

పెనగలూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో ఈనెల 24న జరగనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి జి.ఆది నారాయణ తెలిపారు. ఈ మేరకు గురువారం పోస్టర్లను విడుదల చేశారు. నిధులు, నికర జలాలు సాధన, మూతపడ్డ పరిశ్రమల పునరుద్ధరణ, జిల్లా సమగ్ర అభివృద్ధి అజెండాగా ఈ మహాసభలు జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శులు లక్ష్మీనారాయణ, రాజశేఖర్, కౌన్సిల్ సభ్యులు ఆర్‌శంకరయ్య, ఎస్‌శంకరయ్య, డీహెచ్‌సీఎస్ కార్యదర్శి పి.శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు యాజమాన్య పద్ధతులపై శిక్షణ

సుండుపల్లె, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మామిడిలో యాజమాన్య పద్ధతులపై రైతులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఉద్యాన శాఖ మండల అధికారి వనితా భాయి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సుండుపల్లె మండల కేంద్రం సమీపంలోని ఈడిగపల్లె సచివాలయంలో శాస్త్రవేత్తలతో ఈ శిక్షణా కార్యక్రమం ఉంటుందన్నారు. అలాగే మధ్యాహ్నం పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీలో, శనివారం ఉదయం మాచిరెడ్డిగారిపల్లె పంచాయతీలో, మధ్యాహ్నం ముడుంపాడు పంచాయతీలో ఈ శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని పండ్ల తోటల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మొబైల్ ఫోన్‌కు బానిస కాకూడదు



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రవిప్రకాశ్‌రెడ్డి

పెనగలూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మొబైల్ ఫోన్లకు బానిస కాకూడదని ఎస్‌ఐ రవిప్రకాశ్‌రెడ్డి సూచించారు. గురువారం సాయంత్రం చక్రంపేట ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు లేబాకు గోపాలకృష్ణ అధ్యక్షతన విద్యార్థులకు మొబైల్ ఫోన్ల వినియోగం, డ్రగ్స్, మత్తు పదార్థాలు, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ విద్యార్థులు ఏదైనా అత్యవసర సమాచారం అయితే తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో మాత్రమే ఒకటి లేదా రెండు నిముషాలు మాట్లాడి ఫోన్ పక్కన పెట్టాలన్నారు. ఫోన్లో వచ్చే అశ్లీల యాప్‌లను అసలు తాకరాదన్నారు. మత్తు పదార్థాలు డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అలాగే మైనర్‌లు వాహనాలు నడపరాదని, వాహనదారులు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండి హెల్మెట్ ధరించాలన్నారు. సమావేశంలో ఏఎస్‌ఐ నాగేశ్వరమ్మ, రైటర్ గోపాలకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధనుర్వాత నివారణకు వ్యాక్సిన్ తప్పనిసరి

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ధనుర్వాత వ్యాధి నివారణకు వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించుకోవాలని ప్రిన్సిపాల్ రమేశ్ అన్నారు. గురువారం ఏపీ మోడల్ స్కూల్‌లో ధనుర్వాత నివారణకు టెటనస్ వ్యాక్సిన్ విద్యార్థులకు వేయించారు. ఈ సందర్భంగా ఏఎన్‌యం రెడ్డెమ్మ మాట్లాడుతూ ఇది క్లోస్ట్రీడియం టైటానిక్ అనే బ్యాక్టీరియా వలన కలిగే వ్యాధి అని, ఇది నరాల వ్యవస్థను ప్రభావితం చేసి కండరాలు బిగుసుకుపోయి నొప్పి, జ్వరం వంటి లక్షణాలకు దారితీస్తుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఆశావర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

గాలివీడు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని నూలివీడు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్ ఆధ్వర్యంలో వైద్యురాలు శ్వేతా విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు హెచ్‌బీ, ఐరన్ ట్యాబ్లెట్స్‌తో రక్తహీనత సమస్యను అధిగమించాలన్నారు. పౌష్టికాహారంలో భాగంగా చిక్కీలు, గుడ్లు క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. మరీ ముఖ్యంగా వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది మనోహర్, ఫయాజ్, హరీశ్, నాగరాజు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం మహాదానం

వీరబల్లి, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): అన్నదానం మహా గొప్పదానమని విశ్రాంతి ఉపాధ్యాయుడు మల్లేశ్ అన్నారు. గురువారం స్థానిక షిరిడీసాయి మందిరంలో వీరబల్లికి చెందిన ఎల్లయ్య, అంజనమ్మ, నరసింహులు ఆర్థిక సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. అన్నదానం చేయడం మంచి శుభ పరిణామమని వారికి ఆలయం తరఫున ప్రత్యేక పూజలు చేసి అభినందనలు తెలిపారు. వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి మాట్లాడుతూ గుడి అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోలీసుల అనుమతి తప్పనిసరి

ఓబులవారిపల్లె, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి సందర్భంగా గ్రామాల్లో విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్‌ఐ మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ ఉత్సవ కమిటీ సభ్యులు విగ్రహాల ఏర్పాట్లకు సంబంధించిన నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఏర్పాటు సమయంలో ప్రజల రవాణాకు ఆటంకాలు లేకుండా, లౌడ్ స్పీకర్ల ఏర్పాట్లు లేకుండా, మద్యం, మత్తు పదార్థాలు వాడకుండా నిబంధనలు పాటిస్తూ పండుగను సంతోషంగా నిర్వహించాలని కోరారు.

హాస్టల్‌కు గీజర్ వితరణ

పెనగలూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పెనగలూరు ఎస్సీ హాస్టల్ విద్యార్థుల సౌలభ్యం కోసం తహసీల్దారు డి.అమరేశ్వరి 50 లీటర్ల కెపాసిటీ కలిగిన గీజర్‌ను వితరణ చేశారు. హాస్టల్‌వార్డెన్ హరిక్రిష్ణ అధ్యక్షతన గురువారం సాయంత్రం విద్యార్థుల సమక్షంలో గీజర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉంటే ఏకాగ్రతతో చదువుకుంటాడని, విద్యార్థులు వేడి నీటితో స్నానం చేసేందుకు ఈ గీజర్‌ను అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దారుకు విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు.

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలి

రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ ధర్నా నిర్వహించారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగుల గుర్తింపు, ఎఫ్‌ఆర్‌ఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సీడీపీవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధం జిల్లా అధ్యక్షురాలు ఎస్.శ్రీలక్ష్మి, జాన్‌ప్రసాద్, రాధాకుమారి, తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ ఆలయంలో చమర్తి ప్రత్యేక పూజలు



రాజంపేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాజంపేట టీడీపీ అసెంబ్లీ ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకున్న చమర్తి జగన్ మోహన్‌రాజు విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి శాయశక్తులా పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రాజంపేటకు నేడు చమర్తి రాక

రాజంపేట టౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి హోదాలో శుక్రవారం చమర్తి జగన్‌మోహన్‌రాజు రాజంపేటకు రానున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు, ఒంటిమిట్ట మండల టీడీపీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ సర్కిల్ నుంచి టీడీపీ కార్యాలయం వరకు ర్యాలీ ఉంటుందని, అనంతరం ఏబీ చంద్రారెడ్డి గార్డెన్స్‌లో కార్యకర్తలకు విందు భోజనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

టీడీపీ నేతల సంబరాలు

సిద్దవటం/వీరబల్లి/సుండుపల్లె, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా చమర్తి జగన్ మోహన్ రాజును ప్రకటించడంపై సిద్దవటం మండలం, అలాగే ఆయన సొంత మండలం వీరబల్లిలో, సుండుపల్లెలో గురువారం సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నేత చెంచయ్య నాయుడు, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ మాజీ డైరెక్టర్ మల్లు వెంకటసుబ్బారెడ్డి, పార్లమెంట్ కార్యదర్శి నాగమునిరెడ్డి, వీరబల్లి మండల టీడీపీ అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామజగదీశ్, యువ నాయకులు రాజానాయుడు, బీసీసెల్ పార్లమెంట్ కార్యదర్శి రాజశేఖర్, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

సిద్దవటం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సిద్దవటం ఎంపీడీవో సభాభవనంలో ఎంపీపీ జ్యోతి వెంకటమ్మ అధ్యక్షతన శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఫణిరాజకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వశాఖ అధికారులు, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

విద్యార్థుల పాసుల విషయంలో నిర్లక్ష్యం

- కౌంటర్ నిర్వాహకుడిని

విధుల నుంచి తొలగించిన ఆర్టీసీ డీఎం

రాజంపేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాజంపేట ఆర్టీసీ డిపోలో విద్యార్థులకు బస్సుపాసులు జారీ చేసే కౌంటర్ నిర్వాహకుడు పి.కిషోర్‌ను విధుల నుంచి తొలగించినట్లు ఆర్టీసీ డీఎం రమణయ్య తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొంతకాలంగా ఏఎన్ఎల్ పార్శిల్, విద్యార్థుల బస్సు పాసుల జారీ విషయంలో అదనపు వసూళ్లు చేస్తూ విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవరిస్తున్నట్లు ఫిర్యాదులు అందడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేసి విధుల నుంచి తొలగించామని తెలిపారు. ఏఎన్ఎల్ పార్శిల్ డెలివరి, విద్యార్థుల బస్సుపాసులు జారీ చేసే విషయంలో అదనపు వసూళ్లు చేస్తున్నట్లు పత్రికల్లో రావడం, ఆ సమస్య తన దృష్టికి ఆలస్యంగా వచ్చినప్పటికి వెంటనే స్పందించి చర్యలు తీసుకున్నామని వివరించారు. ఇక మీదట రాజంపేట డిపోలో ఇలాంటి సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సీఐ మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల వేతనాలు పెంచాలి



నిరసన తెలుపుతున్న అంగన్వాడీ కార్యకర్తలు

రాజంపేట టౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కార్యకర్తల వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్ డిమాండు చేశారు. ఈమేరకు వారు గురువారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లు, ఆయాలకు కనీస వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వాలు గౌరవ వేతనం పేరిట వెట్టిచాకిరి చేయిస్తున్నారని ఆరోపించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు చేయాలన్నారు. వేతనాలు పెంచాలని గతంలో అంగన్వాడీలు చేపట్టిన ఆందోళనకు మద్దతు చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఆ ఊసే లేదన్నారు. ప్రభుత్వం వెంటనే అంగన్వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి విజయమ్మ, సెక్టార్ లీడర్లు వనిత, లావణ్య, స్వర్ణ, మమత, శివజ్యోత్స్న, విజయలక్ష్మీ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సెలవుపై కార్యదర్శులు

రాయచోటిటౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): తమ సహ ఉద్యోగులైన పంచాయతీ కార్యదర్శులను కలెక్టర్ సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ రాయచోటి మండలంలోని పలు పంచాయతీల కార్యదర్శులు సామూహిక సెలవుపై వెళ్లారు. ఐవీఆర్‌ఎస్ కాల్స్ సక్రమంగా నిర్వహించలేదన్న కారణంగా రాయచోటి డివిజన్ పరిధిలోని నలుగురు పంచాయతీ కార్యదర్శులను రెండు రోజుల క్రితం కలెక్టర్ సస్పెండ్ చేశారు. ఇందుకు నిరసనగా రాయచోటి మండలంలోని చెన్నముక్కపల్లె కార్యదర్శి శ్రీనివాసులు, గొర్లముదివేడు కార్యదర్శి రమాదేవి, శిబ్యాల కార్యదర్శి వెంకట్రమణ (వెంకీ), పెమ్మాడపల్లె కార్యదర్శి సాజియా, దిగువ అబ్బవరం కార్యదర్శి శివలక్ష్మి, కాటిమాయకుంట మల్లికార్జున తదితర గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సామూహిక సెలవుపై వెళ్లారు. ఈ మేరకు గురువారం ఎంపీడీవో సురేశ్‌బాబుకు వినతిపత్రం అందజేశారు.

పింఛన్ల తొలగింపుపై పునరాలోచించాలి

రాయచోటిటౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగం, ఆర్థిక బాధలు, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పేదలకు, దివ్యాంగుల పింఛన్‌లు తీసేయడమంటే వారిని రోడ్డున పడేయడమేనని, ప్రభుత్వం పునరాలోచించాలని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజకీయాలు వేరు, పింఛన్లు వేరని, అర్హుడికి పింఛన్ ఇవ్వాలన్నదే నిజమైన సంక్షేమమన్నారు. ఇరవై ఏళ్లుగా పింఛన్ తీసుకుంటున్న వ్యక్తి ఒక్క రోజులో అనర్హుడవడం వెనుక ఉన్న దురుద్దేశ్యాన్ని ప్రభుత్వం ఒక్కసారి పునఃసమీక్షించాలని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్ అందించాలని ఆయన కోరారు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం శిఖరం చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్నారు అటవీశాఖ సిబ్బందిపై స్థానిక ప్రజాప్రతినిధి అనుచరులు దాడి చేయడం సిగ్గుచేటని, దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోడూరు ఎఫ్‌ఆర్‌వో శ్యాంసుందర్ తెలిపారు. దాడికి నిరసనగా గురువారం స్థానిక కోడూరు అటవీశాఖ కార్యాలయంలో బాలుపల్లె, కోడూరు రేంజ్ సిబ్బందితో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ప్రభుత్వం బాధిత సిబ్బందికి న్యాయం చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక క్రమశిక్షణ పాటించాలి

వీరబల్లి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఆర్థిక క్రమశిక్షణను అందరూ పాటించాలని డీఆర్‌డీఏ వెలుగు ఏపీఎం ఖాదర్‌వలి అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఆర్థిక అక్షరాస్యతపై జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘ సభ్యులు ఆర్థిక లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏపీజీబీ మేనేజర్ మనోహర్ మాట్లాడుతూ సైబర్ మోసాల పట్ల అవగాహన ఉండాలన్నారు. సెల్‌ఫోన్లకు వచ్చే యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. యూనియన్ బ్యాంకు సానిపాయి మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ సభ్యులందరూ ప్రధాన మంత్రి జీవనజ్యోతి, సురక్ష భీమా సౌకర్యాలను పొందాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ గడికోట మేనేజర్ కరీముల్లా, వెలుగు సిబ్బంది కృష్ణయ్య, నాగేంద్ర, సుధాకర్ పాల్గొన్నారు.

ఘనంగా పసుపులేటి బ్రహ్మయ్య వర్ధంతి

రాజంపేట టౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పసుపులేటి బ్రహ్మయ్య ఆరో వర్ధంతి వేడుకలు గురువారం రాజంపేటలో పసుపులేటి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక కేక్‌ను కట్‌చేసి పేదలకు పంచిపెట్టారు. అనంతరం బ్రహ్మయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గీతాంజలి విద్యాసంస్థల అధినేత రమణ, పైడి రవి, యెద్దల వెంకటేశ్వర్లు, పసుపులేటి చంద్రశేఖర్, ఉద్దండం సుబ్రమణ్యం, తోట రాము, తదితరులు పాల్గొన్నారు.



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న పవన్‌కుమార్

చెత్త సేకరణ వంద శాతం జరగాలి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రవి

రాయచోటి(నేతాజీ సర్కిల్), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ వందశాతం అమలు చేయడానికి రోడ్ మ్యాప్ రూపొందించాలని మున్సిపల్ కమిషనర్ రవి తెలిపారు. గురువారం రాయచోటిలో జరిగిన మున్సిపల్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో ప్రతి 15 రోజులకు ఒకసారి మురుగు కాలువలను శుభ్రపరిచే కార్యక్రమాన్ని చేపట్టాలని శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీలకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి నెలా మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మురుగునీరు నిలిచే ప్రదేశాలను శుభ్రం చేయాలని తెలిపారు. దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచిస్తూ విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని హెచ్చరించారు. పరిశుభ్రమైన ఆరోగ్యకరమైన పట్టణ నిర్మాణంలో అధికారులు, సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

విద్యార్థులతో భోజనం వడ్డింపు



ఎస్పీవీడీ సభా హైస్కూల్లో భోజనం వడ్డిస్తున్న విద్యార్థులు

సిద్దవటం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతి ప్రభుత్వ పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం అమలుకు వంట ఏజెన్సీలను నియమించింది. సమకూర్చారు. మండలంలోని ఉప్పరపల్లె ప్రభుత్వ, ఎయిడెడ్, ఎస్పీవీడీ హైస్కూల్లో గురువారం మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులే తోటి విద్యార్థులకు వంట మనుషులుగా భోజనం వడ్డించారు. నలుగురు విద్యార్థులు తోటి విద్యార్థులకు భోజనం వడ్డిస్తుండడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. హైస్కూల్లో 172 మంది విద్యార్థులు ఉండగా 150 మంది హాజరయ్యారు. ప్రతిరోజూ ఇదేవిధంగా విద్యార్థులు భోజనం వడ్డిస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై కడప జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్‌ను వివరణ కోరగా విద్యార్థుల చేత భోజనం వడ్డించకూడదని, వంట ఏజెన్సీ, యాజమాన్యంకు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు.

రెండు పాడి ఆవులు మృతి

కలుషిత ఆహారమే కారణమన్న పశు వైద్యాధికారి




మృతి చెందిన రెండు పాడి ఆవులు

తంబళ్లపల్లె, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రెండు పాడి ఆవులు అకస్మాత్తుగా మృతి చెందాయి. బాధిత రైతు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక వెంకటేశ్వరవీధికి చెందిన రైతు సుధాకర్ తన మూడు ఆవులను రోజు లాగానే బుధవారం ఇంటి పక్కనే ఉన్న చేన్లో మేతకు తోలుకెళ్లి సాయంత్రం ఆవులను తిరిగి షెడ్డులో తోలి పాలు పితికి మేత వేసి వెళ్లాడు. రాత్రి 9 గంటలకు మేత వేయడానికి వెళ్లగా ఒక ఆవు గిలగిలా కొట్టుకుంటూ కింద పడిపోయింది. ఈ విషయాన్ని స్థానిక పశు వైద్య సిబ్బందికి సమాచారం అందించగా వెంటనే వచ్చి ఆవును పరీక్షించి అప్పటికే చనిపోయినట్లు తెలిపారన్నారు. గురువారం ఉదయం 9 గంటలకు మరో ఆవు కూడా అదే విధంగా చనిపోయిందని రైతు కన్నీటి పర్యంతమయ్యాడు. మరో ఆవు కూడా నీరసంగా ఉండడంతో వెంటనే పశు వైద్యశాలకు తీసుకువెళ్లి చికిత్స అందించడంతో కోలుకుంటున్నట్లు తెలిపాడు. చనిపోయిన రెండు ఆవుల విలువ సుమారు రూ1.50 లక్షల వరకు ఉంటుందన్నాడు. కలుషిత ఆహారం తినడంతోనే ఆవులు మృతి చెందాయని మండల పశు వైద్యాధికారి విక్రమ్‌రెడ్డి ధ్రువీకరించారు. పశువులకు వేసిన దాణా నమూనాను సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు పశువైద్యాధికారి తెలిపారు. ప్రభుత్వం స్పందించి రైతును ఆదుకోవాలని స్థానికులు, రైతులు కోరుతున్నారు.

ఆర్టీసీ ఆధ్వర్యంలో ఉచిత డ్రైవింగ్ శిక్షణ

రాయచోటి (కలెక్టరేట్), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులాల సేవా సహకార సంఘం సౌజన్యంతో ఏపీఎస్ఆర్టీసీ ద్వారా భారీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల సేవా సహకార సంఘం అన్నమయ్య జిల్లా కార్యనిర్వహణాధికారి బి.రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని వారు తెలిపారు. దీనికి అర్హత కలిగిన వారు షెడ్యూల్ కులాలకు సంబంధించిన వారై ఉండాలి. వారికి 21 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలి. మెడికల్ సర్టిఫికెట్‌తో పాటు లైసెన్స్ సర్టిఫికెట్, హెవీ మోటార్ లైసెన్స్ కొరకు 210 రూపాయలు ఎల్ఎల్ఆర్ కొరకు 1060 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని వారు తెలిపారు. ఇందులో మొత్తం 10 మందిని ఎంపిక చేస్తారని అందులో 5 మంది మహిళలు, మిగిలిన 5 మందిని పురుషులను తీసుకుంటారని వారు తెలిపారు. మరిన్ని వివరాల కొరకు 9059100840 నెంబరు సంప్రదించాలన్నారు.

నీతి అయోగ్‌లో కురబలకోటకు బంగారు పతకం



జేసీ నుంచి ప్రశంసాపత్రం అందుకున్న ఎంపీడీవో, సిబ్బంది

కురబలకోట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కురబలకోట మండలానికి నీతి అయోగ్‌లో బంగారు పతకం దక్కినట్లు ఎంపీడీవో గంగయ్య తెలిపారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో రాష్ట్ర స్థాయిలో ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాంలో భాగంగా నీతి అయోగ్ ద్వారా సంపూర్ణ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ప్రభుత్వం నిర్దేశించిన 6 డెవలప్‌మెంట్ ఇండికేటర్స్‌లో 6 మార్కులకు గాను 6 మార్కులు సాధించి కురబలకోట ప్రథమస్థానంలో నిలిచింది. దీంతో ఎంపీడీవో గంగయ్యకు జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ బంగారు పతకంతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

యూరియా.. లేదయా...!

- యూరియా అమ్మలేమంటూ డీలర్ల ఆందోళన
- అవసరానికి మించి వాడుతున్న రైతులు
- డీబీటీ నివేదికల్లో తప్పుల కుప్పలు

ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు కురవక అల్లాడిన రైతులు, ప్రస్తుతం విస్తారంగా వర్షాలు పడటంతో వరి సాగుకు సన్నద్ధమవుతున్నారు. యూరియా కొరత వుందని తెలుసుకుని ఇంట్లో వున్న సభ్యులందరి ఆధార్‌కార్డులు పట్టుకుని ఎరువుల దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. కొంతమంది ముందస్తుగానే యూరియా అధికంగా కొనుగోలు చేసి నిల్వలు ఉంచుకుంటున్నారు. ఎరువుల డీలర్లు యూరియా విక్రయాలంటేనే హడలెత్తుతున్నారు. యూరియా తమ వద్ద లేదంటూ దుకాణాల ఎదుట నోటీసు బోర్డులు పెడుతున్నారు.



మదనపల్లె టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో జిల్లా వ్యాప్తంగా రైతులు వరి సాగుపై దృష్టి పెట్టారు. దీనికి అనుగుణంగా ముందస్తుగా ఎరువులు (యూరియా) సేకరించి నిల్వ చేసుకుంటున్నారు. వచ్చే రబీ సీజన్‌లో 25 వేల హెక్టార్లలో వరి, జొన్నకర్రలు (ఆవులకు మేత)తో పాటు వివిధ రకాల పంటలు సాగు కానున్నాయి. పైరు ఏపుగా పెరిగేందుకు రైతులు యూరియాపైనే ఆధారపడుతున్నారు. జిల్లాలో జూన్, జూలై, ఆగస్టు నెలలకు ప్రభుత్వం కేటాయించిన యూరియా చూసుకుంటే జూన్‌లో ప్రైవేటు దుకాణాలకు 197.2 మెట్రిక్ టన్నులు, రైతు సేవా కేంద్రాలు (ఆర్ఎస్‌కే)లకు 665.04 మెట్రిక్ టన్నులు, జూలై నెలలో ప్రైవేటు దుకాణాలకు 576, ఆర్ఎస్‌కేలకు 1114, ఆగస్టు నెలకు ప్రైవేటు దుకాణాలకు 435, ఆర్ఎస్‌కేలకు 850 మెట్రిక్ టన్నులు కలిపి మొత్తం ఇప్పటి వరకు 3,837 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశారు. ఈ యూరియా స్టాకు వచ్చిన రెండు రోజుల్లో పూర్తిగా అమ్మకాలు అయిపోతున్నాయి ఇది పోనూ ఆగస్టు నెల కోటా కింద 5064 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. రైతులు వారి భూముల వన్-బి, ఆధార్‌కార్డులు తీసుకొచ్చి ప్రైవేటు దుకాణాలు, ఆర్ఎస్‌కేల వద్ద పడిగాపులు కాచి మరీ యూరియా తీసుకెళ్లిపోతున్నారు. దీంతో జిల్లాలోని పలు ఎరువుల దుకాణల వద్ద యూరియా లేదంటూ బోర్డులు పెట్టేస్తున్నారు.



రామసముద్రంలో యూరియా కోసం దుకాణం ఎదుట బారులు తీరిన రైతులు (ఫైల్)

అవసరానికి మించి వాడుతున్న రైతులు

సాధారణంగా వరి సాగులో ఒకటిన్నర ఎకరా విస్తీర్ణానికి మూడు విడతలుగా కేవలం 80 కిలోల యూరియా మాత్రమే వినియోగించాల్సి ఉంది. కానీ వాస్తవంగా రైతులు చూస్తే ఒకటిన్నర ఎకరా వరి మడికి 245 కిలోల యూరియా వాడుతున్నారు. శాస్త్రీయంగా చూస్తే యూరియా వాడకం వలన పైరు ఏపుగా పెరగదని కేవలం సస్యరక్షణ కోసమే మాత్రమే యూరియా ఉపయోగపడుతుందని కేవీకే శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. కానీ రైతులు ఈ సూచనలు, సలహాలు పెడచెవిన పెడుతూ అవసరానికి మించి యూరియాను వాడుతున్నారు.

యూరియా అంటేనే డీలర్ల హడల్

యూరియానా మేమమ్మలేము స్వామి..అంటూ ఎరువుల డీలర్లు ముఖాలు చాటేస్తున్నారు. వాస్తవంగా యూరియా 45 కిలోల బస్తాను రూ.265కు విక్రయించాలి. యూరియా తయారు చేసే కంపెనీలు స్పిక్, జైకిసాన్, మంగళ, ఆర్‌సీఎఫ్, నాగార్జున కంపెనీల నుంచి రైలు మార్గంలో కడప, రేణిగుంట, చిత్తూరు స్టాక్ పాయింట్లకు యూరియా సరఫరా చేస్తాయి. అక్కడ నుంచి జిల్లా వ్యాప్తంగా యూరియా రవాణా చేయాలంటే బస్తాకు రూ.56 ఖర్చు వస్తోంది. అంతేకాకుండా గత ఏడాది యూరియా తయారు చేసే కంపెనీలు ఒక బస్తా యూరియాకు, మరో బస్తా వేప పిండి కొనుగోలు చేయాలని డీలర్లకు కండీషన్లు పెట్టాయి. దీంతో డీలర్లు ఈ కండీషన్‌ను అనుసరించి యూరియాతో పాటు వేప పిండి కూడా కొనుగోలు చేశారు. కానీ డీలర్ల నుంచి రైతులు కేవలం యూరియాను మాత్రమే కొనుగోలు చేశారు, వేప పిండి వద్దంటూ వెళ్లిపోయారు. దీంతో ఒక్కో డీలర్ వద్ద ఇప్పటికి వేపపిండి స్టాకు సేల్స్ లేక అలాగే నిలిచిపోయాయి. ఇకపోతే యూరియా బస్తా రూ.267 ఎమ్మార్పీకి విక్రయించాలి. కానీ ఖర్చులు అధికం కావడం రవాణా, కూలీలు కూడా గిట్టుబాటు కాకపోవడంతో రైతులు యూరియా విక్రయాలకు మొగ్గు చూపడం లేదు. కేవలం రైతు సేవా కేంద్రాలకు వచ్చిన యూరియాను వీఏఏలు విక్రయిస్తున్నారు. అది కూడా రైతులు ఆధార్ కార్డులు, వన్-బి జిరాక్స్‌లు చూపితేనే విక్రయిస్తున్నా..స్టాకు వచ్చిన రోజు సాయంత్రమే ఆర్ఎస్‌కేలు ఖాళీ అయిపోతున్నాయి.

స్టాకు విడుదల చేయని కంపెనీలు

జిల్లాలోని 500 రైతు సేవా కేంద్రాలకు వ్యవసాయ శాఖ యూరియాను మంజూరు చేసి వీఏఏల ద్వారా విక్రయిస్తోంది. ఇలా పంపిన స్టాకు విక్రయించిన వీఏఏలు డైరెక్ట్ బెనిఫిసరి ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) నివేదికలను పూర్తి చేసి జిల్లా ఉన్నతాధికారులకు పంపాలి. కానీ ఇటీవల జిల్లా వ్యాప్తంగా వీఏఏలు బదిలీలు కావడంతో, ఆర్ఎస్‌కేలకు బదిలీపై వచ్చిన వీఏఏలు డీబీటీ నివేదికలు పూర్తి చేయడంలో తప్పులు వచ్చినా, సరిదిద్దకుండా అలాగే ఉన్నతాధికారులకు పంపించేశారు. ఉదాహరణకు మదనపల్లె మండలంలో గత నెల 180 మెట్రిక్ టన్నుల యూరియా మంజూరు కాగా అన్ని ఆర్ఎస్‌కేలలో విక్రయించేశారు. కానీ డీబీటీ నివేదికల్లో కేవలం 20 టన్నులు మాత్రమే విక్రయించినట్లు నివేదికలు చూపిస్తున్నాయి.

అంటే ఇంకా మదనపల్లె మండలంలోని ఆర్ఎస్‌కేలల్లో 120 టన్నులు నిల్వ ఉన్నట్లు డీబీటీ నివేదికల్లో చూపిస్తుండటంతో రెండో దఫా యూరియా స్టాకు విడుదల కావడం లేదు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అంతేకాకుండా వన్-బిలు లేని రైతుల వేలిముద్రలు పడకపోవడంతో కూడా సమస్య వస్తోందని తెలుస్తోంది. ఈ సమస్యలన్నింటిపై గత సోమవారం విజయవాడ నుంచి డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ డిల్లీరావు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వ్యవసాయశాఖ అధికారులకు తగిన సూచనలిచ్చారు. ఎక్కడ కూడా యూరియా కొరత వుండకూడదని హెచ్చరించారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి 150 కుటుంబాలు చేరిక



మంత్రి మండిపల్లి సమక్షంలో టీడీపీలో చేరిన లక్కిరెడ్డిపల్లె వాసులు

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు, ఎంపీటీసీ సభ్యుడు పోలిరెడ్డి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో గురువారం 150 కుటుంబాలు విజయవాడలోని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నుంచి పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పోలిరెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ వైసీపీ మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి కుటుంబానికి ముఖ్య అనుచరుడిగా ఉంటూ వైసీపీలో చేరి ఎంతో సేవ చేశామని, వారి గెలుపునకు ఎంతగానో సహకరించామన్నారు. అయితే గడికోట కుటుంబాల నుంచి ఎలాంటి మేలు జరగలేదని దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు చూసి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సహకారంతో టీడీపీలో చేరామని ఆయన తెలిపారు. అలాగే పందిళ్లపల్లె మాజీ ఎంపీటీసీ రాజేంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ ఉమాపతిరెడ్డి, ముదిరాజ్ సంఘం బీసీ నాయకుడు ఎలంకూరి విజయ భాస్కర్, బడుగు వాసుదేవుడు షొరాసాహెబ్, రవి, ఆచారి, చాగలగుట్టపల్లి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో వెంకట్రమణ, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

మదనపల్లె అర్బన్,ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్టు కదిరి రైల్వే జీఆర్‌పీ సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. గురువారం వెస్ట్ బెంగాల్‌కు చెందిన ఎస్‌కే షైముల్ కుమారుడు షేక్ ఖాదిర్ (30) మదనపల్లె మండలం, సీటీఎం రైల్వేస్టేషన్ సమీప బ్రిడ్జి వద్ద హత్యకు గురైన విషయం తెలిసిందే. మృతుడు ఐదేళ్ల కిందట కురబలకోట మండలం అంగళ్లు గ్రామానికి వచ్చి అక్కడ ఇంటి నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ ఒరిస్సా నుంచి గంజాయి తెచ్చి మదనపల్లెలో అమ్ముతుండేవాడు. నెల క్రితం ఆసిఫ్ అనే వ్యక్తి తనకు 2 కేజీలు గంజాయి కావాలని ఖాదిర్‌కు రూ.50 వేలు ఇచ్చాడు. అతడికి గంజాయి ఇవ్వలేదు. డబ్బు కూడా తిరిగి ఇవ్వలేదు. దీంతో ఆసిఫ్ తన మిత్రులైన మౌలా, సుల్తాన్ చెప్పగా ముగ్గురూ కలిసి ఈనెల 15వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు అంగళ్లలో ఉన్న ఖదీర్ వద్దకు వెళ్లి అతడిని కారులో కిడ్నాప్ చేసి కర్ణాటక రాష్ట్రం రాయల్పాడు వద్ద నీలగిరి తోటలో ఖదీర్‌ను చెట్టుకు కట్టేసి కొట్టారు. అక్కడి నుంచి మదనపల్లెకు ఆసిఫ్ ఇంటికి తీసుకొచ్చి అక్కడ కూడా చిత్రహింసలు పెట్టారు. దీంతో దెబ్బలు తాళలేక అక్కడే చనిపోయాడు. దీంతో శవాన్ని సీటీఎం సమీపంలో రైల్వే బ్రిడ్జి వద్ద పడేసి వెళ్లారు. సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసులు నిందితులను గుర్తించారు. మదనపల్లె మండలం బసినికొండకు చెందిన జాకిర్‌ఖాన్ కుమారుడు ఆటోడ్రైవర్ పఠాన్ ఆసిఫ్‌ఖాన్ (40), మదనపల్లె పట్టణం, దేవళంవీధికి చెందిన షేక్ ఖాదర్‌వలి కుమారుడు షేక్‌మౌలా (33)ను కదిరి పోలీసుల నిందితులను గుర్తించారు. శవాన్ని పడేసేటప్పుడు ఎవరో చూశారని భయపడిన ఇద్దరు ఈనెల 20వ తేదీ కదిరి పోలీసుస్టేషన్‌లో లొంగిపోయారు. మరో నిందితుడు సుల్తాన్ పరారీలో ఉన్నాడు. ఇతడు 2016లో జరిగిన ఓ హత్య కేసులో నిందితుడు, ఇతనిపై రౌడీషీట్ కూడా ఉంది. కేసు దర్యాప్తులో ధర్మవరం ప్రభుత్వ రైల్వే సీఐ అశోక్‌కుమార్, కదిరి ప్రభుత్వ రైల్వే ఎస్ఐ బాలకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ మహబూబ్‌బాషా, ఉన్నారు.

నెలన్నరగా 'బందీగా బుద్ధుడు'

- రేపు తిరుమావళవన్ రాక?



బుద్ధుడి విగ్రహం చుట్టూ ఏర్పాటు చేసిన కంచె

మదనపల్లె, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మదనపల్లె బుద్ధునికొండలో బుద్ధుడి విగ్రహం తల నరికారని ఫిర్యాదు చేస్తే పోలీసులు, రెవెన్యూ అధికారులు కలిసి అక్కడున్న విగ్రహానికి ఇనుప కంచె వేసి బుద్ధుడిని బంధించారు. నెలన్నర రోజులు దాటుతున్నా ఇనుప కంచె నుంచి బుద్ధుడికి విముక్తి కల్పించలేదు. దీనిపై నిరసన తెలిపిన బౌద్ధులపై కేసులు పెట్టారు. దీంతో తీవ్ర ఒత్తిడికి లోనై బాస్ నేత పీటీఎం శివప్రసాద్ గుండెపోటుకు గురై స్టంట్ కూడా వేయించుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు, వీకేసీ పార్టీ అధినేత, పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ తిరుమావళవన్‌తో చర్చలు జరిపి ఇరువర్గాలు సమన్వయం పాటించి పరస్పర సహకారంతో బుద్ధుని కొండ వివాదాన్ని సున్నితంగా పరిష్కారం చేసుకునేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందులో భాగంగా ఈనెల 23వ తేదీ శనివారం ఎంపీ తిరుమావళవన్ బుద్ధుని కొండను సందర్శించేందుకు, అక్కడ బౌద్ధ సమ్మేళనం నిర్వహించుకునేందుకు అనుమతి ఇస్తామని పోలీసులు హామీ ఇచ్చారు. ఈ మేరకు బాస్ నాయకులు దరఖాస్తు చేసుకున్నారు. ఆ తరువాత పోలీస్ అధికారుల సూచనల మేరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు కూడా దరఖాస్తు చేసుకున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పోలీస్, రెవెన్యూ అధికారులు ఒకరిపై ఒకరు చెబుతూ నిర్వాహకులను తిప్పుకుంటున్నారు. సమావేశానికి ఒక్క రోజే వ్యవధి ఉండడంతో అనుమతి ఇస్తారో లేదో తెలియడం లేదు. ఇనుప కంచె నుంచి బుద్ధుడిని విడుదల చేస్తారో లేదో రేపటి వరకు వేచి చూడాల్సి ఉంది.

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి

ఒంటిమిట్ట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేద్దామని ఈగల్ అధికారులు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఉన్నత పాఠశాలలో ఈగల్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్ కట్టడి చేయడం కోసం ఈగల్ పేరుతో టాస్క్‌ఫోర్సును ఏర్పాటు చేశారన్నారు. డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతిఒక్కరు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. గంజాయి, డ్రగ్స్ సంబంధిత మాదక ద్రవ్యాల సమాచారాన్ని ఈగల్ టోల్‌ఫ్రీ నంబరుకు తెలపాలన్నారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులతో మాదకద్రవ్యాల నివారణలో భాగస్వామ్యం అవుతామని ప్రతిజ్ఞ చేయించారు.

కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం రమనిరంజనమ్మ, ఈగల్‌క్లబ్ సభ్యులు అయుబ్‌ఖాన్, నార్కోటిక్ అధికారులు మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న దృశ్యం

రాయచోటి(నేతాజీ సర్కిల్), ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సంబేపల్లె ఆదర్శ పాఠశాలలో పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని అసిస్టెంట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ పీవీ నాగేంద్రకుమార్ అన్నారు. గురువారం ఆదర్శ పాఠశాల, కళాశాలలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల నమోదు శాతం, రికార్డులను పరిశీలించారు. టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ పాఠశాలకు వచ్చే సమయం, బయటకు వెళ్లే సమయాన్ని పరిశీలించారు. తరగతి గదులు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి విద్యార్థులకు అర్థమయ్యేలా సరళరీతిలో బోధన అందించాలని తెలిపారు. విద్యాశక్తి క్లాసుల పనితీరు, ఎంసెట్, జేఈఈ, నీట్, ఎన్ఎంఎంఎస్ తరగతుల నిర్వహణ గురించి సమీక్షించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. పాఠశాల మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టిని తరలిస్తే క్రిమినల్ కేసులు



చెరువులోకి ట్రాక్టర్‌లు వెళ్లకుండా గాడి తీస్తున్న దృశ్యం

గాలివీడు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టిని తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ భాగ్యలత హెచ్చరించారు. గురువారం పెద్దచెరువులో మట్టి తరలిస్తున్న ప్రాంతాన్ని తహసీల్దార్ పరిశీలించారు. అనంతరం చెరువులోకి ట్రాక్టర్లు, జేసీబీ యంత్రాలు వెళ్లకుండా మార్గాలను మూసివేస్తూ ట్రెంచ్ (గొయ్యి) తీయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గుట్టలు, వాగులు, వంకలు, చెరువుల్లో అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలిస్తే క్రిమినల్ కేసులు పెట్టి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. అంతేగాక క్రిందిస్థాయి సిబ్బంది ప్రలోభాలకు పాల్పడి మట్టి వ్యాపారులకు సహకరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్వో, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.21.50 కోట్లతో అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న జడ్పీ సీఈవో

బి.కొత్తకోట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలో రూ.13.50 కోట్ల 15వ ఆర్థికసంఘం నిధులు, రూ.8 కోట్ల ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన నిధులతో మౌలిక వసతుల కల్పన, వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా సీఈవో రవికుమార్‌నాయుడు తెలిపారు. గురువారం ఆయన బి.కొత్తకోట మండలంలో పర్యటించారు. మరమ్మతు పనులు జరుగుతున్న జడ్పీ గెస్ట్‌హౌస్‌ను పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో, సిబ్బందితో ఆయన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. సీఈవో మాట్లాడుతూ మండలంలో చెత్త సంపద కేంద్రాలన్నీ వినియోగంలో ఉండేలా చూడాలన్నారు. రూ.18 లక్షలతో ఆరు గ్రామాలలో నిర్మించిన వాటర్‌ప్లాంట్ల స్థితిపై ఆరా తీశారు. తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, మౌలికవసతుల కల్పనలో పంచాయతీ కార్యదర్శులు అంకితభావంతో పనిచేసేలా చూడాలని ఆదేశించారు. కేంద్ర, కార్యక్రమంలో ఎంపీడీవో క్రిష్ణవేణి, ఏవో ఆనందకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అడల్ట్ కంటెంట్...



- ఇన్‌స్టాగ్రామ్‌లో అశ్లీల దృశ్యాలు
- ఆకర్షితులవుతున్న యువత
- బానిసలుగా మారుతున్న వీక్షకులు
- పోలీసులకు తలనొప్పిగా మారిన సమస్య

కడప క్రైం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత టెక్నాలజీ యుగంలో స్మార్ట్‌ఫోను ఉంటే ప్రపంచమే అరచేతుల్లో కనిపిస్తుంది. సెల్‌ఫోన్ వినియోగించని వారున్నారంటే ఆశ్చర్యమే. ఇక సెల్ చేతిలో ఉంటే ఫేస్‌బుక్, స్నాప్‌చాట్, ఇన్‌స్టాగ్రామ్‌ల వీక్షకుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతూనే ఉంది. ఈ నేపథ్యంలో కొంత మంది యువత, మధ్య వయస్కులు స్వయం తృప్తి కోసం ఆన్‌లైన్‌లో అడల్ట్ కంటెంట్ (అశ్లీల వీడియోలు) చూస్తుంటారు. ఈ మధ్యకాలంలో ఈ కంటెంట్ చూసే వీక్షకులు పెరిగిపోయారంటే అతిశయోక్తి కాదు. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ అడల్ట్ కంటెంట్ చూసేందుకు ఎగబడుతున్నారు. ఇక కొంత మంది యువత దీనికి అడక్ట్ అయిపోయారు. ఈ అశ్లీల వీడియోలు వారిపై ప్రతికూల ప్రభావాలు చూపుతన్నాయి. లైంగిక ఆలోచనలు, ప్రవర్తన, సంబంధాలపై ఈ ప్రభావం ఎక్కువగా కనబడుతోంది. వీరి వీక్‌నెసన్‌ను క్యాష్ చేసుకునేందుకు కొందరు సిగ్గు విడిచి బూత్ కంటెంట్, అశ్లీల దృశ్యాలు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేస్తున్నారు. యువకులను ఆకట్టుకునేలా రీల్స్ చేస్తున్నారు. టెంప్ట్ చేసే వీడియోలను ప్రైవేటులో ఉంచి మరింత కంటెంట్ కోసం సబ్‌స్క్రిప్షన్ అడుగుతున్నారు. ఇలాంటి వీడియోలను చూడాలంటే రూ.399 స్కానర్ ద్వారా వసూలు చేస్తున్నారు. ఓ మహిళ ఇన్‌స్టాగ్రామ్‌లో రూ.399 ఫీజు పెట్టగా.. ఆ ఫీజు చెల్లించి దాదాపు 8730 మంది సబ్ స్క్రయిబ్ చేసుకున్నారంటే ఆశ్చర్యానికి గురి చేస్తుంది.

- కడపకు చెందిన ఓ వివాహిత ఇన్‌స్టాగ్రామ్‌లో తన అశ్లీల దృశ్యాలను ప్రైవేటులో ఉంచింది. దాని కంటెంట్ కోసం సబ్‌స్క్రిప్షన్ అడగ్గా, ఎంతోమంది ఆ వీడియోల కోసం డబ్బులు చెల్లించి మరీ వీక్షించారు. గతంలో తన ప్రియుడుతో చేసిన వీడియో సైతం పోస్టు చేసినట్లు తెలుస్తుంది, చివరికి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆమెకు కౌన్సెలింగ్ చేసి పంపినట్లు సమాచారం.
- జిల్లాకు చెందిన మరో యువతి కూడా ఇలాగే వీడియో లను పోస్టులు చేసి యువత నుంచి డబ్బులు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు ఇదొ కొత్త వ్యాపారంగా మారుతోంది. ఇలాంటి వాటిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. పోలీసుల వద్దకు పోతే మన పరువు పోతుందన్న ఉద్దేశ్యంతో చాలా మంది వెనుకడుగు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో యువతను తల్లిదం డ్రులు సరైన దారిలో పెట్టలేక సతమతమవుతున్నారు. అడల్ట్ కంటెంట్‌తో వీడియోలు తీస్తూ సొమ్ము చేసుకుంటున్న వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

యువతపై ప్రభావం

అడల్ట్ కంటెంట్ యువతలో లైంగిక ఆలోచనలను రేకెత్తిస్తుం ది. ఇది వాస్తవికతకు దూరంగా ఉండే భావాలను కలిగి ఉండడానికి దారి తీస్తుంది. ఇలాంటి అశ్లీల వీడియోల వైపు యువత, పిల్లలతో పాటు పెద్దలు కూడా మొగ్గు చూపుతుంటారు. దీంతో వాస్తవికత జీవితం ఇలాగే ఉండాలనే భావనకు వస్తూ కొంతమంది దంపతులు విడిపోయే పరిస్థితులు తలెత్తుతు న్నాయి. మరికొందరు ఇతరులపై మోజు పెంచుకుని చేయి దాటి వెళుతున్నారు. ఇలాంటి వాటిపై ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో పోలీసులు చర్యలు తీసుకోలేని పరిస్థితి.

అప్రమత్తంగా ఉండాలి

13 నుంచి 20 సంవత్సరాల మధ్య యువతకు మంచి చెప్పినా బుర్రకు ఎక్కదు. ఇక మొబైల్ చేతిలో ఉంటే ఫేస్‌బుక్కు, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లో గడుపుతుంటారు. ఆ సమ యంలో పిల్లలు ఎలాంటి వీడియోలు చూస్తున్నారో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉంటూ గమనిస్తూ ఉండాలి. ఎక్కువగా యువత అశ్లీల దృశ్యాలకు ఆకర్షితులవుతున్నారు. దీంతో ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లోని అడల్ట్ కంటెంట్ వీడియోలకు ఎక్కువగా యువత బానిసగా మారుతోంది. ఈ నేపథ్యంలో పిల్లల పట్ల తల్లిదండ్రులు బాధ్యతగా ఉండాలంటూ పోలీసులు చెప్పుకొస్తున్నారు.

డీసీఈబీ హాల్ నిర్మాణానికి సహకరించండి

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పదివేల మంది ఉపాధ్యాయులకు సంబంధించిన జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యాలయ నిర్మాణానికి సహకరించాలని కడప జిల్లా ఎస్టీయూ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇలియాస్ బాష, సంగమేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం జడ్పీ కార్యాలయంలో సీఈఓ ఓబుళమ్మను కలిసి వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1997లో అప్పటి జిల్లా పరిషత్ ఛైర్మన్ తులసిరెడ్డి నిర్మింపజేసిన డీసీఈబీ హాల్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సంబంధించిన పరీక్షల నిర్వహణ, ప్రశ్నపత్రాల రూపకల్పన, ఉపాధ్యాయుల కౌన్సెలింగ్, విద్యారంగ సమస్యలపై సమావేశాల నిర్వహణకు ఉపయుక్తంగా ఉండేదన్నారు. దీన్ని కూల్చివేయడంతో ప్రస్తుతం డీసీఈబీ హాల్ లేక ఉపాధ్యాయులు, విద్యాశాఖ మండల, జిల్లా అధికారులకు చాలా ఇబ్బందికరంగా ఉందని తెలిపారు. కామన్ ఎగ్జామినేషన్ బోర్డు హాల్ నిర్మాణానికి సహకరించాలని ఎస్టీయూ ప్రతినిధులు కోరారు.

పెద్ద దర్గా అభివృద్ధికి సహకరించాలి



సీఎం చంద్రబాబుకు వివరిస్తున్న పీఠాధిపతి అరిఫుల్లాహుస్సేని

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో ప్రసిద్ధి చెందిన అమీన్‌పీర్ దర్గా అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలని పీఠాధిపతి హజ్రత్ కేఎస్ఎస్ అరీఫుల్లాహ్ హుస్సేని కోరారు. గురువారం సెక్రటేరియట్‌లో టీడీపీ కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు. పెద్దాదర్గా అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేయగా.. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తూ దర్గా అభివృద్ధికి అన్ని విధాలా సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

విషద్రావణం తాగి యువకుడు మృతి

దువ్వూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇడమడక గ్రామానికి చెందిన వినోద్‌కుమార్ (26) అనే యువకుడు విషద్రావణం తాగి మృతి చెందినట్లు ఎస్‌ఐ వినోద్‌కుమార్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. ప్రొద్దుటూరుకు చెందిన పవిత్ర అనే యువతిని వినోద్‌కుమార్ ప్రేమించాడు. వీరి పెళ్లికి పెద్దలు నిరాకరించారు. దీంతో ఆగస్టు 15న పవిత్ర ఉరి వేసుకుని మృతి చెందింది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన వినోద్‌కుమార్ బుధవారం రాత్రి విషద్రావణం తాగాడు. చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరుకు అటు నుంచి కర్నూలుకు తరలించగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుని తండ్రి గాబ్రియల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



శ్రీనివాసులు (ఫైల్)

దువ్వూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న భాకరాపురం గ్రామానికి చెందిన సి.శ్రీనివాసులు (54) అనే రైతు గురువారం విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు ఎస్‌ఐ వినోద్‌కుమార్ తెలిపారు. పొలం వద్ద మోటారు వదులుతుండగా షార్ట్‌సర్క్యూట్ కారణంగా షాక్‌కు గురై మృతి చెందాడన్నారు. మృతుని భార్య శివమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టంనిమిత్తం ప్రొద్దుటూరుకు తరలించినట్లు వివరించారు.

పొలం విషయమై దాడి

ముద్దనూరు ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి చిన్నదుద్యాల గ్రామంలో పొలం విషయమై గురువారం బోరెడ్డి శివనారాయణరెడ్డిపై అదే గ్రామానికి చెందిన భూమిరెడ్డి నాగిరెడ్డి మరి కొందరు దాడి చేసి గాయపరిచినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. సీఐ సమాచారం మేరకు వివరాలిలా.. బోరెడ్డి శివనారాయణరెడ్డి, భూమిరెడ్డి నాగిరెడ్డిల మధ్య పొలం విషయంలో తగాదా ఉంది. ఈ తరుణంలో శివనారాయణరెడ్డి పొలంలో పనిచేసుకుంటుండగా భూమిరెడ్డి నాగిరెడ్డి, లక్ష్మిప్రసాదరెడ్డి, బాలనాగిరెడ్డి, మరికొందరు పొలం వద్దకు ట్రాక్టర్లలో వచ్చి అతనిపై గొడ్డలితో దాడి చేశారు. దీంతో శివనారాయణరెడ్డికి రెండు చేతులకు రక్తగాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగితీగ చోరీ

సింహాద్రిపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బలపనూరు గ్రామం సాయిబాబా ఆలయం ప్రాంగణంలో గల సింగిల్ ఫేస్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ లోని రాగి తీగ బుధవారం రాత్రి చోరీకి గురైంది. గమనించిన ఆలయ నిర్వాహకులు గురువారం విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చారు. మండల విద్యుత్ అధికారి దినేష్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను కిందకు దించి అక్కడే పగులగొట్టి కాపర్ వైర్‌ను దుండగులు దోచుకెళ్లారు. ఈమేరకు సింహాద్రిపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఏఈ తెలిపారు.

పొలంలో విద్యుత్ వైర్లు...

మైదుకూరు రూరల్, ఆగస్ట 21 (ఆంధ్రజ్యోతి): పంట పొలాల్లోని బోర్ల వద్ద విద్యుత్ వైర్లు చోరీకి గురైనట్లు రైతులు మైదుకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ, వెంకటాపురం గ్రామాలలోని పొలాల వద్ద దొంగలు కరెంటు వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరు దొంగలించినట్లు తెలిపారు. ఆరుగాలం శ్రమించినా పంటల పండక అవస్థలు పడుతుంటే దొంగల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని బాధితులు పోలీస్‌స్టేషన్‌లో వాపోయారు.

రుణాలు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి

కడప ఎన్టీఆర్‌సర్కిల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాలతో పాటు రుణాలు పొందిన వారు సద్వినియో గం చేసుకోవడంతో పాటు సకాలంలో తిరిగి రుణాలు చెల్లించాలని డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి అన్నారు. డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో బ్యాంకర్లు, ఏపీయంలతో సంఘాల రుణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సంఘానికి ఆర్థిక, అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యతపై శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. జిల్లాలోని 26508 స్వయం సహాయక సంఘాలకు 10970 డిజిటల్ ఎంసీపీని ఆమోదించినట్లు తెలిపారు. మిగిలిన సంఘాలకు ఈనెలాఖరులోపు ఆమోదం వస్తుందన్నారు. రుణాలు మంజూరు చేసేందుకు బ్యాంకర్లు మరింతగా సహకరించాలని ఆమె కోరారు. రుణాల చెల్లింపులో రికవరీ మొత్తాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. అలాకాకుండా ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్య లు తీసుకుంటామని హెచ్చరించారు. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజరు కిశోర్ మాట్లాడుతూ కడప డివిజనులో ఎస్‌బీఐ బ్రాంచ్‌లు ఈనెల నాలుగో శనివారం కూడా పనిచేస్తాయని.. సెర్ప్ సిబ్బంది బ్యాంకు అధికారులతో మాట్లాడి సంఘాలకు సంబంధించిన ఎంసీపీలు, సంఘాల రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎల్‌డీఎం జనార్ధన్, డీసీసీబ్యాంకు సీఐవో రాజామణి, వివిధ బ్యాంకుల ఆర్‌ఎంలు, డీఆర్‌డీఏ డీపీయంలు, జీవనోపాధుల డీపీయంలు, ఏపీఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ప్రపంచానికి తెలుగు జాతి కీర్తిని చాటిన నేత ఎన్టీఆర్



ఎన్టీఆర్ కాంస్య విగ్రహావిష్కరణలో ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

మైదుకూరు రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచానికి తెలుగుజాతి కీర్తిని చాటిన మహానుబావుడు ఎన్టీఆర్ అని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్ కొనియాడారు. మైదుకూరులోని కడప రోడ్డులో నూతనంగా మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని గురువారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌తో కలసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాయల్ కూడలి నుంచి ఏర్పాటు చేసిన ర్యాలీలో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ఫ్లడ్ లైట్లను ప్రారంభించి, ఎన్టీఆర్ విగ్రహ సమీపంలో మొక్కలను నాటారు. మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రవీంద్ర, టీడీపీ నాయకులు దాసరి బాబు, యాపరాల చిన్న, పాశం మారుతీ, మిల్లు శ్రీను, పుట్టా ప్రభాకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ సిబ్బంది నిరసన



కడప ఫారెస్టు డివిజను ఆఫీసు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అటవీశాఖ సిబ్బంది

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం వద్ద బుధవారం రాత్రి అక్కడ అటవీ సిబ్బందిపై స్థానిక ఎమ్మెల్యే, ఆయన అనుచరులు దౌర్జన్యం చేసి దుర్భాషలాడుతూ భౌతిక దాడులకు దిగిన సంఘటనపై వైఎస్ఆర్ కడప డివిజను అటవీశాఖ సిబ్బంది గురువారం ఫారెస్టు డివిజను ఆఫీసు వద్ద నిరసన వ్యక్తం చేశారు. నల్లబ్యాడ్జిలు ధరించి దాడులకు పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. అటవీ వనరులను కాపాడడానికి నిరంతరం కష్టపడుతున్న ఉద్యోగులపై ఇలాంటి దాడులు సరికాదన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సహచర ఉద్యోగులకు పూర్తి న్యాయం జరిగేంత వరకు నిరసన కార్యక్రమాలు సాగిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీలకు 10 మంది ఎంపిక

కడప స్పోర్ట్స్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): హర్యానాలోని కురుక్షేత్రంలో ఈనెల 25 నుంచి 27 వరకు జరుగనున్న జాతీయస్థాయి కరాటే పోటీలకు కడప జన్ షిటోర్ యు కరాటే విద్యార్థులు పది మంది ఎంపిక కావడం అభినందనీయం అని జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ పేర్కొన్నారు. ఆ మేరకు ఎంపికైన విద్యార్థులను గురువారం స్థానిక డీఈఓ కార్యాలయంలో ఆయన అభినందించి మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు ఆత్మస్థైర్యం పెంపొందించుకునేందుకు కరాటే క్రీడను ఎంచుకుని ప్రతిభ చాటడం ప్రశంసనీయమన్నారు. ఎంపికైన క్రీడాకారులు జాతీయ స్థాయిలో విజయం సాధించి జిల్లాకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కోచ్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ ఏజెన్సీపై కేసు నమోదు

కడప క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కడప నగరం సీపీబ్రౌన్ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన లిఫ్ట్ పని చేయకపోవడంతో డాక్టర్ రామచంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏజెన్సీలపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు సీపీ బ్రౌన్ లైబ్రరీలో 2018లో ఎస్‌పీసీ ఇన్‌ఫ్రా భారత్ ఎంటర్‌ప్రైజస్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో లిఫ్ట్ ఏర్పాటు చేశారు. అయితే అప్పటి నుంచి లిఫ్ట్ పనిచేయకపోవడంతో పలుమార్లు వారు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించలేదు. ఈ మేరకు సీపీబ్రౌన్ మెంబర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైతు ఆత్మహత్యపై విచారణ



ఇడమడక గ్రామంలో ప్రజలను విచారిస్తున్న ఆర్డీవో

దువ్వూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇడమడక గ్రామంలో రంగగాళ్ల బుజ్జి అనే రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై గురువారం జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ విచారణ చేశారు. ఏడీఏ క్రిష్ణమూర్తి, తహసీల్దారు సంజీవరెడ్డి, ఎస్‌ఐ వినోద్‌కుమార్‌తో కలిసి రైతు ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు. 2024 మే 6వ తేదీన అప్పుల బాధతో రైతు బుజ్జి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతనికి భార్య నరసమ్మ, నలుగురు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. అప్పట్లో ఏడు ఎకరాలు కౌలుకు తీసుకొని పంటలు సాగుచేసి తీవ్రంగా నష్టపోయి అప్పులపాలయ్యాడు. అప్పులు తీర్చే మార్గం లేక విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాలన్నింటిపై కుటుంబ సభ్యులు, అక్కడి ప్రజలతో అధికారులు ఆరా తీశారు. వీరు తెలిపిన విషయాలను విచారణ బృందం నమోదు చేసుకున్నారు.

చీపాడు పాఠశాలలో డీఈవో తనిఖీ



డీఈవోకు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

చాపాడు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చియ్యపాడు దళితవాడలోని ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్ గురువారం తనిఖీ చేశారు. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు పాఠశాలను ఆయన పరిశీ లించారు. ఇటీవల ఆ పాఠశాలలోని విద్యార్థులు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద తమ పాఠశాలను మోడల్ స్కూల్‌గా ఎంపిక చేయాలని ధర్నా నిర్వహించారు. ఇందుకు కలెక్టర్ స్పందించి ఆ పాఠశాల స్థితిగతులను తెలు సుకోవాలని ఆదేశించడంతో డీఈవో పాఠశాలను సందర్శిం చారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామచందర్‌రెడ్డి, ఏపీటీఎఫ్ మండలశాఖ అధ్యక్షుడు రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున డీఈవోకు వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు చెప్పవద్దని, ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మూల్యాంకన పుస్తకాన్ని, అనవసరమైన యాప్‌లను రద్దు చేయాలని వారు వినతి పత్రంలో కోరారు.

సివిల్, ఏపీఎస్పీ కానిస్టేబుళ్లు 23న హాజరు కావాలి

కడప క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సివిల్, ఏపీఎస్‌పీ కానిస్టేబుళ్లుగా ఎంపికైన వారు ఆగస్టు 23న తమ సర్టిఫికెట్లతో గుంటూరులో హాజరు కావాలని గుంటూ రు ఎస్పీ సతీష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని జిల్లాల నుంచి ఎస్‌సీటీ సివిల్, ఏపీఎస్పీ ఉద్యోగాలకు ఎంపికైన పురుష, స్త్రీ అభ్యర్థులు ఈనెల 23న గుంటూరు జిల్లా పోలీసు కార్యాలయం వద్ద ఉదయం 10గంటలకు హాజరు కావాలని తెలిపారు. అభ్యర్థులు ఎంపిక ప్రక్రియలో అప్లికేషన్‌తో జతపరిచిన అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, గెజిటెడ్ అధికారితో అటెస్టేషన్ చేయించిన మూడు సెట్ల జిరాక్స్ కాపీలు, నాలుగు పాస్‌పోర్టు సైజు కలర్ ఫొటోలను తీసుకురావాలని ఎస్పీ తెలిపారు.

పెన్నాకు కొనసాగుతున్న నీటి విడుదల

మైలవరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి నీటి విడుదల కొనసాగుతోందని జలాశయ అధికారులు సోమవారం తెలిపారు. పెన్నానదికి దాదాపు 10 వేల క్యూసెక్కుల నీరు, అలాగే ఉత్తర, దక్షిణ కాలువలకు 190 క్యూసెక్కుల మేర నీటిని వదులుతున్నామన్నారు. గండికోట జలాశయం నుంచి మైలవరం జలాశయానికి 10 వేల క్యూసెక్కుల మేర నీరు వచ్చి చేరుతోందన్నారు. మైలవరం జలాశయం పూర్తి నిలువ సామర్థ్యం 6.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 5.2 టీఎంసీల నీరు నిలువ ఉందన్నారు.

ఏఆర్ కానిస్టేబుల్ సస్పెన్షన్

కడప క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కడప ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న జి.శ్రీనివాసులను సస్పెండ్ చేస్తూ ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. కడపకు చెందిన ఓ నేత వద్ద ఆ కానిస్టేబుల్ గన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అయితే అతని వద్ద ఉన్న పిస్టోలు 9ఎంఎం పోగొట్టుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై విచారించిన ఎస్పీ అతనిపై సస్పెన్షన్ వేటు వేశారు.

ఎంపీహెచ్‌డబ్ల్యు శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

కడప రిమ్స్ ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కడప రిమ్స్‌లో గల ప్రభుత్వ బహుళ ప్రయోజన ఆరోగ్య కార్యకర్తల మహిళా శిక్షణ పాఠశాలలో ఎంపీహెచ్‌డబ్ల్యు (ఫిమేల్) ట్రైనింగ్ కోర్సులో చేరేందుకు ఇంటర్‌మీడియట్ ఉత్తీర్ణులైన కడప, అన్నమయ్య, అనంతపురం జిల్లాల అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.లక్ష్మీ కోరారు. కోర్సు కాలవ్యవధి 2 సంవత్సరాలు ఉంటుందన్నారు. శిక్షణలో చేరు విద్యార్థినులకు ఉచిత విద్య, వసతి, వైద్యంతో పాటు రూ.2వేల నుంచి రూ.2500 వరకు స్టయిఫండ్ ఇస్తారన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులతో పాటు కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఏపీ పేరుతో తీసిన రూ.50 డీడీని జతచేయాలన్నారు. ఫీజు చెల్లింపునకు సెప్టెంబర్ 30 ఆఖరు తేదీ. ఎంపిక జాబితాను అక్టోబరు 15న ప్రకటిస్తారన్నారు. ఇతర వివరాలకు 944041165, 8790710182, 9491038846 అనే నెంబర్లను సంప్రదించాలన్నారు.

పశువుల ఆస్పత్రి కన్నా అధ్వానం : ఎమ్మెల్యే



జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాష

మదనపల్లె అర్బన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యాధికారుల సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మండిపడ్డారు. గురువారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని అత్యవసర విభాగం, ఓపీ, రక్త మార్పిడి, రక్తనిధి విభాగాలను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ ఇది పశువులు ఆస్పత్రికన్నా అధ్వాన్నంగా ఉందని మండిపడ్డారు. ఆస్పత్రిలో సూపరింటెండెంట్ కోటేశ్వరి, ఆర్ఎంఓ షుకూర్ సెలవుపై వెళ్లడాన్ని ఎమ్మెల్యే దుయ్యబట్టారు. రికార్డులను పరిశీలించిన ఆయన రెండు నెలలు గడుస్తున్నా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. సెక్యూర్టీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నిర్వహణ అధ్వాన్నంగా ఉందని వెంటనే మారాలన్నారు. వికలాంగుల ధృవీకరణ పత్రాల్లో వైసీపీ ప్రభుత్వం వైకల్యం తక్కువగా ఉన్నా ఎక్కువగా సర్టిఫికెట్లు మంజూరు చేసిందని ఇప్పుడు రీ వెరిఫికేషన్‌లో వైకల్యం తగుగతుందే తప్ప ఫించన్ తొలగించరన్నారు. టీడీపీ నేతలు మాజీ జడ్పీటీసీ ద్వారకనాథరెడ్డి, షంషీర్, రామూర్తినాయుడు, తమ్మిశెట్టి రామకృష్ణ, ఆస్పత్ని వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణపై అవగాహన



వివేకానంద మున్సిపల్ హైస్కూల్‌లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల నియంత్రణపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, సబ్ యూనిట్ అధికారి ఖలీలుల్లాఖాన్ అన్నారు. గురువారం నీరుగట్టువారిపల్లెలో వివేకానంద మున్సిపల్ హైస్కూల్, బీటీ కళాశాల, మదనపల్లె మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులకు కాలానుగుణంగా వచ్చే వ్యాధులపై వైద్యులు అవగాహన కల్పించారు. డెంగీ, మలేరియా, గున్యా, ఫైలేరియా, మెదడువాపు, నిమోనియా, అతిసార, టైఫాయిడ్ కామెర్లు, స్వైన్ ఫ్లూ, కళ్లకలక వంటి జబ్బులపై కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, జ్వరాలు వచ్చిన వెంటనే ప్రభుత్వ ఆస్పత్రులకు రావాలని సూచించారు. వ్యక్తిగత శుభ్రత పాటించాలని పెద్దలు, షుగర్ ఉన్నవారు గళ్ళ పరీక్ష చేయించుకోవాలని చెప్పాలన్నారు. డాక్టర్లు భార్గవి, సల్మాన్, ప్రిన్సిపాల్స్ కృష్ణవేణి, శ్రీదేవి, విజయలక్ష్మీ, హెల్త్ అసిస్టెంట్లు గంగయ్య, కిరణ్, సురేంద్ర, ఏఎన్ఎం లీలా, సూర్య లక్ష్మీ, ఆశాకార్యకర్తలు రుక్మిణి, కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

షామియానాల 'నీడలో' షాదీలు



- ఇరుకు గదుల్లోనే కల్యాణాలు
- దెబ్బతిన్న తలుపులు, కిటికీలు
- ఆరుబయటే భోజనాల తయారీ, విందు
- ట్యాంకర్ల నీరే దిక్కు
- పేదల పెళ్లిళ్లకు అగచాట్లు

కలకడ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): నూరేళ్ల పంటగా భావించే షాదీలు (పెళ్లిళ్లు) షామియానాల నీడలో చేసుకోవాల్సిన దుస్థితి కలకడలో నెలకొంది. వివరాల్లోకెళితే...

సూమారు 9 వేల పైచిలుకు ముస్లిం జనాభా వున్న మండలంలో వివాహాలు చేసుకునేందుకు సరైన వేదిక లేదనేది నగ్నసత్యం. వీరిలో ఆర్థిక స్థోమత కలిగిన వారు రాయచోటి, పీలేరు, గుర్రకొండ, సంబేపల్లిల్లో అధునాతన సదుపాయాలున్న ఫంక్షన్ హాల్‌లో వివాహాలు చేయిస్తుంటారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు సరైన వేదిక లేక ఇబ్బందులు పడేవారు. అయితే 2002లో ఓ దాత షాదీ మహల్ నిర్మాణానికి 30 సెంట్ల స్థలాన్ని ఉచితంగా ఇచ్చినట్లు శిలాఫలకం వేశారు. ఆ తరువాత కొన్నాళ్లకు భవన నిర్మాణాలు జరిగినట్లు స్థానికులు తెలిపారు. అయితే మండపం, హాల్, గదులు వసతులు సరిగా లేకపోవడం, ఇరుకుగా వుండడంతో వివాహాలు చేసుకునేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. అంతేకాకుండా భవనం కిటికీలు, తలుపులు దెబ్బతిన్నాయి. కానీ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సౌకర్యాలు, వసతులు లేక శుభకార్యాలు జరిపించడం కష్టతరమవుతోందని ప్రజలు అసంతృప్తి వ్యక్తపరిచారు. ముఖ్యంగా హాల్ చిన్న పాటిది కావడంతో అటూ ఇటూ తిరగలేక పోతున్నామన్నారు. దీంతో ముందువైపున్న ఖాళీ జాగాలో షామియానాలు ఏర్పాటు చేయించుకుని కార్యాలు నిర్వహిస్తున్నారు. ఆరుబయటే పొవ్వులు పెట్టించి వంటకాలు తయారీ చేయించడం, విందుకు వచ్చిన వారికి వడ్డింపులు జరుగుతాయి. షాదీ మహల్ ప్రాంగణంలో బోరున్నా నిరుపయోగంగా మారడంతో ట్యాంకర్ల ద్వారా తాగునీరు సమకూర్చుకుంటున్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు గత్యంతరం లేక బతుకు జీవుడా అనుకుంటూ నివాసముంటున్న ప్రాంతాల వీధుల్లో, ఖాళీ ప్రదేశాల్లో కార్యాలు జరిపిస్తున్నారు. ప్రభుత్వం దయతలచి యువతరానికి మేలు జేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



కలకడలోని షాదీమహల్



ఏర్పాటు చేసుకున్న షామియానా



ఆరుబయటే వంటకాల తయారీ

సౌకర్యవంతంగా మార్చాలి



పేరుకు మాత్రమే షాదీమహల్ వుందని చెప్పాలి. రెండు దశాబ్దాల కిందట నిర్మించినది కావడంతో బాగా పాతబడింది. వసతులు ఏమాత్రం అనువుగా లేవు. సౌకర్యావంతంగా మార్చితే అందరికీ ఉపయోగపడుతుంది.

వడ్ల సయ్యద్‌సాబ్‌వలి, కలకడ

అవస్థలు తప్పుతాయి



షాదీమహల్‌లో శుభకార్యాలు జరిపించాలంటే ప్రతిదానికీ ఇబ్బందే. వంటకాల తయారీ, వడ్డింపులకు సమస్యే. మంది ఎక్కువైతే చూట్టూ షామియానాలు ఏర్పాటు చేయించుకోవాలి. ఇది వ్యయ, ప్రయాసతో కూడుకోవడంతో పేద, మధ్యతరగతి వారిపై భారం పెరుగుతుంది. ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్టు పనులు పూర్తి చేయిస్తే బయటకు వెళ్లే అవస్థలు తప్పుతాయి.

షేక్ ఖాజా, కలకడ

'అభివృద్ధిని అడ్డుకోవడమే వైసీపీ అజెండా'

మదనపల్లె టౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పాలనలో జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధిని అడ్డుకోవడమే వైసీపీ నేతల అజెండా అని జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ తప్పుపట్టారు. స్థానిక నిమ్మనపల్లె సర్కిల్ వద్ద టీడీపీ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో వైసీపీ ఇన్‌చార్జి నిస్సార్‌అహ్మద్, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నార న్నారు. వాస్తవానికి జగన్‌రెడ్డి ఐదేళ్లు ప్రజలను మోసం చేయడంతో ప్రజలు వైసీపీకి 11 ఎమ్మెల్యే సీట్లే ఇచ్చారని గుర్తుచేశారు. సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం మంచి పేరుతెచ్చుకుంటుంటే వైసీపీ నేతలు తట్టుకోలేకున్నార న్నారు. మదనపల్లెకు హంద్రీ నీవా జలాలను తెప్పించిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందని అన్నారు. టీడీపీ నేతలు చంద్రశేఖర్‌నాయుడు, ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించమని తెలుగు యువత నియోజక వర్గ అధ్యక్షుడు నాదెళ్ల అరుణ్‌తేజ్ హెచ్చరించారు. గురువారం ఆయన మాట్లాడుతూ మదనపల్లెలో వైసీపీ నేతలు నిస్సార్ అహ్మద్ పేటీఎం బ్యాచ్ ప్రజల వద్దకు వెళ్లి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు మీద బురదజల్లే వాఖ్యలు చేస్తే చట్టప్రకారం వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

అనర్హత జాబితాపై ఆందోళన వద్దు

పీలేరు రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మం డలంలో వికలాంగుల పెన్షన్ల అనర్హత జాబితాపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎంపీడీఓ శివశంకర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలో అంగవైకల్యంతో పెన్షన్లు తీసుకుం టున్న వారిని ప్రత్యేక వైద్య బృందం పరీక్షించి 282 మందిని అనర్హులుగా గుర్తించి, వారికి నోటీసులు జారీ చేస్తున్నట్లు చెప్పారు. అనర్హుల జాబితాలో అర్హులుంటే నోటీ సు తీసుకున్న నెలలోపు సచివాలయంలో ధరఖాస్తు చేసుకుంటే మరో మారు పరీ క్షించి అర్హులకు పెన్షన్ పునరుద్ధరిస్తామన్నారు. 85 శాతంపైగా శారీరక వైకల్యం ఉండి మంచానికే పరిమితమైనట్లు వైద్యుల ధృవీకరణ ఆధారంగా సెప్టెంబరు నుం చి రూ. 15 వేలు హెల్త్ పెన్షన్ పొందవచ్చన్నారు. వెరిఫికేషన్‌లో వైకల్యం 85 శాతం కంటే తక్కువ 40 శాతం కంటే ఎక్కువ ఉన్నట్లైతే హెల్త్ పెన్షన్ నుంచి వైకల్య పెన్ష న్ రూ. 6 వేలకు మార్పు చేస్తారన్నారు. వైకల్యం 40 శాతం కంటే తక్కువ ఉండి 60 ఏళ్ల పైబడిన వారికి వృద్ధాప్య పెన్షన్‌గా నెలకు రూ. 4 వేలు ఇస్తామన్నారు.

పెన్షన్ పునరుద్ధరణ కోసం

అనర్హుల జాబితాలో ఉన్న వారు పెన్షన్ రద్దు చేసిన సర్టిఫికెట్, పాత పెన్షన్ సర్టిఫి కెట్, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, మెడికల్ బోర్డు అప్లికేషన్ ఫారంతో మెడిక ల్ బోర్డుకు హాజరవాల్సి ఉంటుందని తెలిపారు. మెడికల్ బోర్డు పరీక్షల అనంతరం ఇచ్చే మాన్యువల్ మెడికల్ సర్టిఫికెట్‌ను ఎంపీడీఓ కార్యాలయంలో అందజేస్తే అర్హు లైతే పాత పెన్షన్ పునరుద్ధరణ అవుతుందని తెలిపారు. సమావేశంలో పీలేరు ఏఎంసీ డైరెక్టర్ గోళ్ల కిషోర్ నాయుడు, పలువురు పెన్షను దారులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

తంబళ్లపల్లె, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల్లోని మహిళా సంఘ సభ్యులు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఏపీయం గంగాధర్ కోరారు. గురువారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో మండల సమాఖ్య సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్వాక్రా గ్రూపుల నిర్వహణ, బ్యాంకు రుణాలు, పొదుపు, తిరిగి చెల్లింపులు తదితర విషయాలపై చర్చించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలిగా రామలక్ష్మి, కార్యదర్శిగా నౌజియా, కోశాధికారిగా ప్రమీల, ఉపాధ్యక్షురాలిగా సరస్వతమ్మ, ఉప కార్యదర్శిగా లక్ష్మీదేవిలను ఎన్నుకున్నారు.

తాగునీటికి ఇబ్బంది కలగకుండా చూడాలి

మదనపల్లె, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలో తాగునీటికి ఇబ్బందులు కలగకుండా చూడాలని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో శానిటేషన్, మున్సిపల్ మేనేజర్‌తో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో పట్టణంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షపు నీరు రోడ్లపై నిల్వ లేకుండా చూడాలన్నారు. మురికినీటి కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పెంపునకు ప్రతిపాదనలు

పీలేరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పీలేరు నియోజకవర్గంలో 20 పోలింగ్ కేంద్రాల పెంపునకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు పీలేరు నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి అమరనాథరెడ్డి తెలిపారు. పీలేరు తహసీల్దారు కార్యాలయంలో గురువారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 1200 కంటే ఎక్కువ ఓట్లున్న పోలింగ్ కేంద్రాలను విభజించాలన్న ఎన్నికల సంఘం నిబంధనల మేరకు 20 అదనపు పోలింగ్ కేంద్రాల కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. పీలేరు నియోజకవర్గంలో ప్రస్తుతం 281 పోలింగ్ కేంద్రాలు, 1,15,105 మంది పురుష ఓటర్లు, 1,19,954 మహిళా ఓటర్లు, 21 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దారు శివకుమార్, డీటీ ప్రసాద్, ఏఎస్‌ఓ రెడ్డప్ప నాయుడు, ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి, టీడీపీ, సీపీఐ, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

నల్లగుట్టపై కార్యక్రమాలకు అనుమతి లేదు : సీఐ

మదనపల్లె అర్బన్, ఆగస్టు 21ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకిశెట్టిపల్లె గ్రామం నల్లగుట్టపై బుద్ధుని విగ్రహం వద్ద ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించడానికి అనుమతులు లేవని తాలూకా సీఐ కళా వెంకటరమణ, తహశీల్దార్ కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ నల్లగుట్ట రెవెన్యూ రికార్డులో ప్రభుత్వ స్థలంగా ఉందని, అక్కడ ఈ నెల 23వ తేదీన బుద్ధుని విగ్రహం వద్ద పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పీటీఎం శివప్రసాద్ ప్రసారమధ్యమాల్లో తెలియజేస్తున్నారని, అలాంటి కార్యక్రమాలు చేయడానికి అనుమతులు లేవని అన్నారు. ప్రస్తుతం అంకిశెట్టిపల్లె గ్రామస్థులు తాము పశులువులు పేపుకోడానికి ఈ నల్లగుట్ట అవసరమని స్థానిక సబ్‌కలెక్టర్‌కు విన్నవించారని తెలిపారు. ఆ ప్రాంతంలో 5 కిలోమీటర్ల మేరకు 163 చట్టం అమలు ఉండడంతో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాదన్నారు. ఉన్నతాధికారులు అనుమతులు ఇచ్చే వరకు నల్లగుట్టపై ఏ కార్యక్రమాలు చేయడానికి లేదన్నారు.

తెలుగుతమ్ముళ్ల బాహాబాహీ...

గ్రామకమిటీ ఎన్నికలు మరోసారి పెండింగ్

బి.కొత్తకోట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): టీడీపీ సంస్థాగత ఎన్నికలలో ప్రాతినిధ్యం కోసం బి.కొత్తకోట మండల తెలుగుతమ్ముళ్లు మరోసారి బాహాబాహీకి దిగారు. పార్టీ ప్రస్తుత ఇన్చార్జికి అనుకూలంగా కొందరు, వ్యతిరేకంగా మరికొందరు గ్రూపులుగా ఏర్పడి గ్రామ, పట్టణ కమిటీ ఎంపిక ఏకగ్రీవం కాకుండా చేస్తున్న విషయం తెలిసిందే. ఇంతకు మునుపు పట్టణకమిటీ ఎంపిక సందర్భంగా అబ్జర్వర్ల సమక్షంలో తలపడటంతో పాటు, గ్రామకమిటీ ఎంపికలలో సైతం తీవ్రస్థాయిలో వాదోపవాదాలు జరగటంతో కమిటీలన్నీ పెండింగ్‌లోనే వున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం అబ్జర్వర్ మాధవరెడ్డి, మండలపార్టీ కన్వీనర్ నారాయణస్వామిరెడ్డిలు కమిటీల ఏర్పాటుకు పర్యటించారు. గుడిపల్లి, బీరంగి, బడికాయలపల్లి, వేమిలేటికోట పంచాయతీలలో కార్యకర్తల సమావేశాలు నిర్వహించగా ఏ ఒక్కచోటా ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో ఆయా గ్రామాలలో ఆశావహుల పేర్లు నమోదు చేసుకొని బయప్పగారిపల్లికి వెళ్లారు. అక్కడ సమస్య మరింత తీవ్రమైంది. ఇరువర్గాలు ఒకరినొరకు నిందించుకుంటూ బాహాబాహీకి దిగారు. దీంతో అబ్జర్వర్ వెళ్లిపోయారు. అనంతరం ఫిర్యాదులకోసం ఇరువర్గాలూ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. పోలీసులు ఇద్దరికీ నచ్చజెప్పి పంపివేశారు. ఈ సందర్భంగా పరిశీలకులు మాధవరెడ్డి మాట్లాడుతూ బి.కొత్తకోట మండలంలో ఏకాభిప్రాయం కుదిరే అవకాశాలు లేవని, ఆశావహుల పేర్లను అధిష్టానానికి పంపితే, పార్టీ ఐవీఆర్‌యస్ ద్వారా కమిటీలను వేస్తుందన్నారు.


అట్టహాసంగా ప్రమాణస్వీకారోత్సవం



ప్రమాణం స్వీకారం చేస్తున్న పాలకమండలి సభ్యులు

పీలేరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): దొడ్డిపల్లెలోని శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఆలయ నూతన పాలకమండలి ప్రమాణస్వీకారోత్సవం గురువారం అట్టహాసంగా జరిగింది. ఆలయంలో జరిగిన కార్యక్రమంలో చైర్మన్‌గా సిద్దవటం బాలసుబ్రహ్మణ్యం, సభ్యులుగా గాజుల సరస్వతి, వరలక్ష్మి, శైలజ, నాగరాజు, ఎన్.వీరయ్య, హరికృష్ణ, నరసింహన్, సుధారాణి ప్రమాణం చేశారు. ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి సమక్షంలో ఆలయ ఈఓ టి.మంజుల అందరి చేత ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శశి, పీలేరు ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి, టీడీపీ నేతలు కోటపల్లె బాబురెడ్డి, లడ్డూ జాఫర్, నారే సతీశ్, పోలిశెట్టి సురేంద్ర, కోడి రామకృష్ణారెడ్డి, హరీశ్ గుప్త, సీవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి



మదనపల్లెలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

మదనపల్లె టౌన్ / తంబళ్లపల్లె, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్లకు 2014 నుంచి ప్రభుత్వాలు వేతనాలు పెంచలేదని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ గురువారం నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడుతూ 2024లో 42 రోజుల పాటు సమ్మె నిర్వహిస్తే వేతనాలు పెంచుతామని మినిట్స్ ఇచ్చారని, అయినా ఇంతవరకు ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మొబైల్ ఫోన్లు కొన్ని యాప్‌లకు సహకరించడం లేదన్నారు. ఈ సమస్యలన్నింటినీ ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్ అసోసియేషన్ నాయకురాళ్లు మధురవాణి, సీఐటీయూ నాయకుడు హరీంద్రనాథ్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు వేతనాలు పెంచాలని, ఎఫ్ఆర్ఎస్ విధానం రద్దు చేయాలని అన్నారు. పనిచేయని ఫోన్ల స్థానంలో ట్యాబులు పంపిణీ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గౌరి, పార్వతి, కరుణశ్రీ, సులోచన, స్వరూపా, సుజాత తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించాలి

మదనపల్లె టౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సమాజంలో బాల కార్మిక వ్యవస్థను ప్రతిఒక్కరూ కలిసి నిర్మూలించాలని డివిజనల్ లేబర్ ఆఫీసర్ ఇర్ఫాన్ హుస్సేన్ పేర్కొన్నారు. గురువారం స్థానిక టౌన్‌హాల్లో పోర్డు సంస్థ ఆధ్వర్యంలో మండల స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. పోర్డు సంస్థ డైరెక్టర్ లలితమ్మ మాట్లాడుతూ తల్లిదండ్రులకు విద్య ప్రాధాన్యత తెలిసినప్పుడే బాల కార్మిక వ్యవస్థను ఆదిలోనే నిలపవచ్చన్నారు. కిశోర బాలికలను గుర్తించి వారికి 18 ఏళ్ల వరకు సంపూర్ణ విద్య అందించాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సౌమ్యపల్లవి, ఐసీడీ ఎస్ సూపర్‌వైజర్ శ్వేత, పోర్డు సిబ్బంది జలజాక్షి, అల్తాఫ్, నిర్మల, జయలక్ష్మి, సుభాషిణి, స్వర్ణ, నరసింహ పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

మదనపల్లె టౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం వేంపల్లెలో శనివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరెస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల, మానవతా స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా వేంపల్లె జడ్పీహైస్కూల్లో 23వ తేదీన ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు అరవింద్ కంటి ఆస్పత్రి వైద్యులు కంటి పరీక్ష, చికిత్స అందిస్తారన్నారు. ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


ముగిసిన మహా కుంభాభిషేకం



యల్లమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న చండీయాగం

కలికిరి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక పురాతన గ్రామ దేవత యల్లమ్మ ఆలయంలో మూడు రోజులుగా జరిగిన మహా కుంభాషేకం కార్యక్రమాలు గురువారంతో ముగిశాయి. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం అనంతరం చండీ యాగం నిర్వహించారు. శాస్త్రోక్తంగా నిర్వహించిన చండీ యాగంలో పాలుపంచుకునేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త అశోక్‌కుమార్ రెడ్డి, నిర్వాహకులు భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

చవితి వేడుకలకు ముందస్తు చర్యలు



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ వెంకటరమణ

మదనపల్లె అర్బన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగను పురస్కరించుకుని గతంలో వివాదాలు జరిగిన ప్రాంతమైన మదనపల్లె మండలం, వేంపల్లె వాసులు 20మందిని తాలుకా పోలీసుస్టేసన్‌కు పిలిపించి ముందస్తు చర్యల్లో భాగంగా సీఐ కళావెంకటరమణ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఘర్షణ వాతావరణం సృష్టిస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ చంద్రమోహన్, పోలీసులు పాల్గొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

కలకడ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మొర్రంమీదపల్లె వద్ద జూదం ఆడుతున్న ఏడుగురిని గురువారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. వారి నుంచి రూ.2570 నగదు స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించినట్లు చెప్పారు. ఈ దాడిలో సిబ్బంది రమేష్, నరేంద్ర పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపరాదు

గుర్రంకొండ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర, ఆటో డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలను నడపరాదని ఎస్ఐ రఘురాం అన్నారు. గురువారం కలకడ రోడ్డులో వాహనాలను తనిఖీ చేసి జరిమానా విధించారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణీకులను తరలించరాదన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ గజేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.